# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



సోమవారం 25 ఆగష్టు 2025


## భక్తులుతో కిటకిటలాడిన గంగమ్మ ఆలయం

**లక్కిరెడ్డిపల్లి; ఆగస్ట్ 24, ప్రభాతవార్త :**



గంగమ్మ దేవత వర్షాలు కురిపించి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండేలా కరుణించి కాపాడు తల్లి అంటూ ఆదివారం గంగమ్మ దేవతకి వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు.కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆలయం కి భక్తులు తరలి రావడంతో క్యులైన్ లలో అమ్మ వారి దర్శనం కొరకు భక్తులు వేచి ఉన్నారు శ్రావణమాసం ముగిసిన అనంతరం భక్తులు రంగమ్మాలయానికి బారులు తీరారు భక్తులతో రద్దీగా మారి చిన్న పాటి జాతరను తలపించింది. ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. చుట్టూ ప్రక్క ప్రాంతాల వారు కాకుండా , యితర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.ఆలయ పూజారులు చెల్లు వంశీయులు గంగన్న సురేంద్ర గంగాంజనేయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## డిఎస్సిలో 20వ ర్యాంకు

**ఒంటిమిట్ట ఆగస్టు 24( ప్రభాతవార్త)**



2025 డిఎస్సీ పరీక్షల్లో మండల కేంద్రమైన ఒంటిమిట్టకు చెందిన గాదే. హైందవి కుమారి డి/ఓ డాక్టర్ శివకుమార్ మొదటిసారి పరీక్షల్లో 20వ ర్యాంకు సాధించినట్లు ఆదివారం తమ కుటుంబీకులు తెలియజేశారు. ఈ సందర్భంగా హైందవి తండ్రి శివకుమార్ ప్రభాతవార్తతో మాట్లాడుతూ చిన్నతనం నుంచి తన కుమార్తె హైందవి చదువులో మెరుగ్గా ఉండేదని క్రమశిక్షణగా ఉంటూ విద్యను అభ్యసించేదని ఈ క్రమంలో 2025 డీఎస్సీ పరీక్షల్లో మొట్ట మొదటిసారిగానే ఎస్ ఎ బయాలజీలో 20వ ర్యాంకు, టీజీటీ బయోలాజికల్ సైన్స్ లో 9వ ర్యాంకు సాధించడంపై హర్షం వ్యక్తం చేశాడు. పదవ తరగతి వరకు ఒంటిమిట్ట జడ్పీ హైస్కూల్లో విద్య అభ్యసించిందని అనంతరం ఇంటర్మీడియట్ నారాయణ జూనియర్ కాలేజీ, కడప, డిగ్రీ నాగార్జున డిగ్రీ కాలేజ్ ఉమెన్స్ కడప, ఎం సి ఏ అన్నమాచార్య ఇంజనీరింగ్ కాలేజీ రాజంపేట, బిఎడ్ విక్రమ సింహపురి యూనివర్సిటీ నెల్లూరు పూర్తి చేయడం జరిగిందని డీఎస్సీలో 20 వ ర్యాంకు సాధించడంపై సంతోషం వ్యక్తం చేశాడు.

# మట్టి గణపతే.. మహా గణపతి..

- పర్యావరణ హితం మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే విగ్రహాలతో అనర్థాలు
- వినాయక చవితి ఉత్సవాలకు ముస్తాబవుతున్న మండపాలు



**గాలివీడు, ఆగస్టు 24 ప్రభాతవార్త:**

వినాయకచవితి రానే వచ్చింది.. మరో వారం రోజుల్లో ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఊరు వాడా అంతా ఇప్పటికే సందడి మొదలైంది. గణనాధులను ప్రతిష్ఠించి పూజలు చేసేందుకు పిల్లల నుంచి పెద్దల వరకు అంతా ఉత్సాహంగా మండపాలను సిద్ధం చేస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా వినాయక విగ్రహాలకు 3-11 రోజుల పాటు పూజించి నిమజ్జనం చేస్తారు. అయితే ఎంతో ఆర్భాటంగా నిర్వహించే ఈ ఉత్సవాలలో భక్తులు మట్టిగణపతి ప్రతిమలను పూజించాలని పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంధ సంస్థల సభ్యులు అంటున్నారు. మట్టితో చేసే వినాయక ప్రతిమలతో పర్యావరణానికి, జలవనరులకు ఎలాంటి హాని జరగదని అవగాహన కల్పిస్తున్నారు.

### మట్టి విగ్రహాలతోనే మేలు:

ఆనాదిగా వస్తున్న ఆచార సాంప్రదాయాలకు అనుగుణంగా మట్టి ప్రతిమలనే పూజించాలని పలువులు పెద్దలు అంటున్నారు. కానీ ఎన్నో ఆకృతుల్లో, హానికరమైన రసాయన రంగులతో వినాయక ప్రతిమలు అందుబాటులోకి రావడంతో యువత, ప్రజలు వాటికి ఆకర్షితులవుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన విగ్రహాలు పర్యావరణానికి హానికరమని తెలిసినప్పటికీ హంగులు, ఆర్భాటాల కోసం నేడు వాటినే మండపాల్లో ఏర్పాటు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. మట్టి వినాయకులనే పూజించేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, యువత ఈ దిశగా ఆలోచన చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

### ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ముప్పు:

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే విగ్రహాలు చెరువులు, నదుల్లో నిమజ్జనం చేసినా అవి తొందరగా కరగవు. ఈ ప్రతిమల్లో జిప్సమ్, గంధకం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ వంటి రసాయనాలు ఉంటాయి. వీటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులకు జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది. రసాయనాలు కలిపిన నీటిమూలంగా చర్మవ్యాధులు వస్తాయి. శరీరంలో నరాలపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధికి దారితీస్తుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగడానికి కొన్ని నెలల సమయం పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపై కాలుష్య ప్రభావం పడుతుంది. రసాయన రంగులు కలిపిన నీరు పంట పొలాలకు అందించడం ద్వారా దిగుబడులు తగ్గడమే కాకుండా ఆహార ఉత్పత్తులు కలుషితమవుతాయి.

### జంతుజలానికి ఎంతో ముప్పు



వినాయక చవితి ఉత్సవాలలో మట్టి ప్రతిమను పూజించడం అన్ని విధాలా శ్రేయస్సు. రసాయనాలతో తయారుచేసే విగ్రహాలతో మానవాళికే కాదు జంతుజలానికి ఎంతో ముప్పు. కాలుష్యానికి కారణమయ్యే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే విగ్రహాలను కాకుండా మట్టి వినాయక ప్రతిమలనే మండపాల్లో ప్రతిష్ఠించుకోవాలి.

- డాక్టర్ రామచంద్రారెడ్డి, వైద్యులు, గాలివీడు:

### అవగాహన కల్పిస్తున్నాం



మట్టి వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజలు చేసుకోవాలని ఎన్నో ఏళ్లుగా అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులు వినాయక మట్టి ప్రతిమలు కావాలంటే మా సంస్థ సభ్యులను సంప్రదిస్తే అందజేస్తాం.

- ఆర్యశంకర్, సేవాభావం వ్యవస్థాపకులు, గాలివీడు

### మట్టి వినాయకులనే ప్రోత్సహిద్దాం



మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాల్సిన అవసరం యువతలో ఎంతైనా ఉంది. రకరకాల రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే విగ్రహాలు ఆకర్షణీయంగా కనిపించవచ్చు కానీ వాటి వల్ల చాలా ముప్పు. పర్యావరణానికి హాని తలపెట్టకుండా మట్టి ప్రతిమలతో ఉత్సవాలను చేసుకుందాం.

- ఆవుల శివారెడ్డి, గాలివీడు:

## శారీరక దృఢత్వం..సంపూర్ణ ఆరోగ్యానికి సైక్లింగ్

### సన్‌డేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్.పి అశోక్ కుమార్



**కడప క్రైం, ఆగస్టు 24, ప్రభాతవార్త :**

శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో దోహదపడుతుందని జిల్లా ఎస్.పి జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు నగర శివార్లలోని ఊటుకూరు సర్కిల్ నుండి మౌంట్ ఫోర్ట్ స్కూల్ వరకూ 6 కి.మీ నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎస్.పి ప్రారంభించారు. స్వయంగా పాల్గొని పోలీస్ అధికారులు, సిబ్బంది లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ సైక్లింగ్ సహజసిద్ధమైన వ్యాయామమని తెలిపారు. ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్ ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమన్నారు. సైక్లింగ్ వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, ఒత్తిడిని తగ్గించడానికి, మానసిక ప్రశాంతతకు సాయపడుతుందన్నారు. క్రమం తప్పకుండా సైక్లింగ్ చేయడం వల్ల క్యాలరీలు ఖర్చయి బరువు తగ్గడానికి ఉపయోగపడుతుందన్నారు. రక్తపోటు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సైక్లింగ్ సహాయపడుతుందని తెలిపారు. పోలీస్ సిబ్బందితో పాటు ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొద్ది సమయాన్ని శారీరక వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించినపుడే కుటుంబం సంతోషంగా ఉంటుందని, పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో వాహనాలలో ప్రయాణించడం అందరికి అలవాటుగా మారిందని, సైక్లింగ్ ద్వారా పర్యావరణానికి మేలు చేయడంతో పాటు మన ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్.పి బి.రమణయ్య, ఏ.ఆర్ డి.ఎస్.పి కె.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.ప ఎన్.సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, సి.కె దిన్నె సి.ఐ నాగభూషణ్, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, ఆర్.ఐ లు శివరాముడు, టైటెస్, వీరేష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ డి.కె జావీద్,చిన్న చౌకు సి.ఐ ఓబులేసు, చెన్నూరు సి.ఐ కృష్ణారెడ్డి, కడప టూ టౌన్ సి.ఐ సుబ్బారావు, సి.కె దిన్నె ఎస్.ఐ శ్రీనివాసుల రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గుంతల మయం.. గుండెల్లో భయం!

- పట్టించుకోని ఆర్ అండ్ బి,పంచాయతీ రాజ్ అధికారులు
- అడుక్కోక గుంత..... గజానికో గొయ్యి
- గతుకులు, గుంతలతో వాహనదారుల్లో గుబులు
- మరమ్మతులకు నోచుకోక ప్రయాణికుల ఇబ్బందులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



వేంపల్లి లో చిన్నపాటి వర్షం వస్తే అధోగతి



గుంతల గుంతలుగా మారిన వేంపల్లి రోడ్లు

**పులివెందుల, ఆగస్ట్ 24, ప్రభాత వార్త:**

అడుక్కోక గుంత.. గజానికో గొయ్యి , గతుకులు, గుంతల మారిన వేంపల్లి రోడ్లపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. వర్షం పడింది అంటే రోడ్లపై నీరు నిలవడంతో ఎక్కడ గుంత ఉందో.. ఏ పక్కన గొయ్యి ఉందో తెలియక వాహన దారులు గుండెల్లో భయంతో కొట్టుమిట్టాడుతున్నారు. వేంపల్లి లోని అంతర్గత రోడ్ల దుస్థితి ఘోరంగా మారింది.గత ప్రభుత్వంలో రోడ్ల విస్తరణలో భాగంగా వేంపల్లి ప్రధాన రోడ్లన్నీ పగలకొట్టి భూగర్భ డ్రైనేజ్ పనులు చేపట్టారు. పులివెందులలోని నియోజక వర్గంలోనే పెద్ద పంచాయతీ అయిన వేంపల్లి మీదుగానే పులివెందుల నుంచి కడప వైపు వెళ్ళాలన్న, ప్రొద్దుటూరు నుంచి అన్నమయ్య జిల్లా కేంద్రం అయిన రాయచోటికి వెళ్ళాలి అన్నా కచ్చితంగా వేంపల్లి మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. అయితే సాధారణ ఎన్నికలు రావడం వైసిపి ఓడిపోవడంతో అధికారంలో కుటుం ప్రభుత్వం వచ్చింది. దీనితో గత ప్రభుత్వంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కుటుంబ ప్రభుత్వం వచ్చిన వెంటనే పనులను నిలిపి వేశాడు. చేసిన పనులకు బిల్లులు అవుతాయో కాదా అన్నా భయంతో గుత్తేదారుడు చేతులెత్తేసాడు. రోడ్లన్నీ పగలగొట్టడం కారణంగా ఎక్కడ చూసి రోడ్లన్నీ కంకర తేలడం ,మూరెడుకు పైగా అడుక్కో గుంత పడంతో ఈ రహదారుల్లో ప్రయాణం అంటేనే వాహనదారుల్లో వణుకు వస్తోంది. రాత్రి వేళ గుంతలు పడిన మార్గాల్లో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టక పోవడంతో ఎదురుగా వచ్చే గుంతలను గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. కూటం ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతిష్టాత్మకంగా ప్రధాన రహదారుల లో గుంతలు లేని రోడ్లుగా మారుస్తామని లక్షల రూపాయలు కేటాయించి గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టారు అయితే వేంపల్లి లో మాత్రం ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడ కూడా గుంతల పూడిక కార్యక్రమం సక్రమంగా జరగలేదు. ఒకవైపు సగం రోడ్లు వేయడం మిగిలిన సగం రోడ్లు వేయకపోవడంతో దాదాపుగా పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. ఈ రహదారిలో పెద్ద వాహనాలైన ఆర్టీసీ బస్సులు గాని లారీలు కానీ వెళ్లినా కూడా ఆ గుంతలలో వాహనాలు నుగ్గు అవుతుండ డం వలన రిపేర్ చేసుకోవడా నికి వేల రూపాయలు ఖర్చు అవుతోంది.ఇక వర్షాలు పడితే ఈ మార్గాలలో ప్రయాణించ డం అంటే ప్రాణ సంకటములా తయారైంది. గర్భిణీ స్త్రీలు వేంపల్లి లోని రోడ్డులలో వాహనాల్లో ప్రయాణిస్తే ఖచ్చితంగా ఆ అదుర్లకు ప్రసవనం కూడా అవుతారని ప్రజలు, ప్రయాణికులు గుంతల మయమైన రోడ్డు గురించి చమత్కారంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆర్ అండ్ బి మరియు పంచాయతీ రాజ్ అధికారులు చొరవ చూపాలి..

వేంపల్లి లో రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్లన్నీ గుంతల మయమై చిందర బందరు గా మారిన రోడ్లనందు ప్రయాణికులు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడకుండా కనీసం పంచాయతీరాజ్ శాఖ గాని ఆర్ అండ్ బి శాఖ అధికారులు గానీ చొరవ చూపి గుంతలు పూడిక కార్యక్రమా లు అన్నా చేపడితే ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవవు. కానీ ఎవరు ఎట్లా పోతే మాకేమి అన్నట్టుగా అధికారు లు మొద్దు నిద్ర వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎక్కడ కూడా గుంతలు లేని రోడ్లుగా రాష్ట్ర రోడ్లన్నీ కూడా మార్చామని చెబుతున్నారు కానీ వేంపల్లిలో మాత్రం కూటమి ప్రభుత్వ చేస్తున్న ప్రకటనలకు పరిస్థితులు విరుద్ధంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి రహదారీపై ఉన్న గుంతలన్నింటినీ పూడ్చి ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూడాలని ప్రజలు మరియు ప్రయాణికులు కోరుతున్నారు.

### రోడ్ల నిర్మాణ పనుల పూర్తి అయ్యేందుకు కూటమి నాయకులు చర్యలు చేపట్టాలి..

అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వ స్థానిక నాయకులు ప్రత్యేకమైన చొరవ చూపి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. స్థానిక కూటమి ప్రభుత్వ నాయకులు నియోజవర్గ ఇన్చార్జి ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిర్మాణ పనులు చేపట్టేందుకు గుత్తేదారులను నియమించి త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు ఆ దిశగా కూటమి ప్రభుత్వ నాయకుడు చర్యలు చేపడతారని ఆశిద్దాం.

## విద్యాలయాలు విద్యార్థుల భవిష్యత్ కు పునాదులు

### టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు



రాయచోటిలో గురువుల నుంచి సన్మానం అందుకున్న జగన్మోహన్ రాజు

**రాయచోటి, ఆగస్టు 24 ప్రభాతవార్త**

విద్యాలయాలు విద్యార్థుల భవిష్యత్ కు పునాదులని,ప్రతి గురువు ఒక లైబ్రరీ లాంటి వారనీ రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇన్చార్జి చెమ్మట్టి జగన్మోహన్ రాజు అన్నారు.రాజు విద్యా సంస్థలు విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా అని పేర్కొన్నారు. రాయచోటి రాజు విద్యాసంస్థల ఆత్మీయ సమావేశం లో చమర్తి జగన్ మోహన్ రాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ విద్యాలయాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా పునాదులు వేస్తాయని, విద్యార్థులకు విద్య నేర్పే గురువు వారి భవిష్యత్తుకు బంగారు బాట వేస్తారని అన్నారు. అందుకే రాజు విద్యాసంస్థల్లో విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా బోధన ఉంటుందని తెలిపారు .అలాగే విద్యాసంస్థల్లో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు లాంటివారని ఆయన తెలియజేశారు. మంచి బోధన క్రమశిక్షణ ఉన్నప్పుడే భవిష్యత్తుకు బంగారం బాట అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజు విద్యాసంస్థల వ్యవస్థాపకులు సుబ్బరాజు, కరస్పాండెంట్ చమర్తి శోభా, ప్రిన్సిపల్ శంకర్ నారాయణ, వంశీకృష్ణ, రమణయ్య, హెడ్మాస్టర్ సదాశివ, గోపికృష్ణ ఆనంద్ రఘురామరాజు మోహన్ రెడ్డి రెడ్డప్ప అనిల్ లలిత ,ఉమా సెంట్రల్ అకాడమిక్ హెడ్ షెడ్యూల్ రాధమ్మ, అనిత, రాజు విద్యాసంస్థల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రారంభానికి సిద్ధమవుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- ప్రారంభ కార్యక్రమానికి విద్యాశాఖామంత్రి నారా లోకేష్
- ముందస్తు పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్, ఎస్పీ

**పెండ్లిమర్రి, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ, విజయదుర్గ కాలనీ సమీపంలో 10.55 ఎకరాల సువిశాల స్థలంలో దాదాపు రూ.12 కోట్ల అంచనా వ్యయంతో 2019 ఫిబ్రవరి 3న ప్రధాని మోదీ చేతుల మీదుగా (ఆన్‌లైన్)పునాది రాళ్లు పడ్డ ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం దాదాపు 5 సంవత్సరాల తరువాత కూటమి ప్రభుత్వంలోని విద్యాశాఖామంత్రి నారా లోకేష్ తన స్వహస్తాలతో సెప్టెంబరు 2వ తేదీ ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా కళాశాల భవనాన్ని ముందస్తు పర్యవేక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఐఎన్ఎల్ వెంకటేశ్వర్లుతో అధికారులు కళాశాల భవనానికి చెందిన అన్ని విషయాలను కూలంకషంగా చర్చిస్తూ ప్రతి ఒక్క గదిని క్షుణంగా పరిశీలించారు. విద్యాశాఖామంత్రి నారా లోకేష్ వచ్చే సమయానికి ఇక్కడున్న పనులన్నీ పూర్తి చేయాలని పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని వారు కళాశాల ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, మ ండల తహసీల్దార్ అనురాధ, తెదేపా మండల అధ్యక్షుడు ఎస్పీజీఆర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## యూరియా, ఎరువులు పై అక్రమాలకు పాల్పడితే కేసు నమోదు చేసి లైసెన్స్ క్యాన్సిల్ చేస్తాం

**లక్కిరెడ్డిపల్లె; ఆగస్టు 24 ప్రభాతవార్త**

యూరియా , ఎరువులపై ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై సిక్స్ ఏ కేసులు నమోదు చేసి లైసెన్సులను క్యాన్సిల్ చేయడం జరుగుతుందని విజిలెన్స్ సిఐ నారాయణ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని లక్కిరెడ్డిపల్లి టౌన్ పరిధిలో ఉన్న గణేష్ ట్రేడర్స్, రైతు మిత్ర ఆగ్రోస్, జనతా ఫర్టిలైజర్స్ షాపులను సీఐ నారాయణ, కానిస్టేబుల్ యుగంధర్ ,మండల వ్యవసాయ అధికారిని జి రాజకుమారి తో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎరువుల దుకాణము డీలర్ల యొక్క లైసెన్స్ వివరాలు, స్టాక్ రిజిస్టర్ ఎరువుల కి సంబంధించిన అన్ని వివరాలను తనిఖీ చేసి రూల్స్ కి వ్యతిరేకంగా గాని లేక బిల్లు ఇవ్వకుండా రైతులకి ఎరువులను అమ్మటం కానీ సరైన రికార్డులు నిర్వహించకపోతే ఆ యొక్క డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ నారాయణ గారు తెలియజేశారు. ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ తనిఖీలలో వ్యవసాయ కార్యాలయ సిబ్బంది, విజిలెన్స్ అధికారులు, ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.



# సీఎం ఎన్నికల హామీ నిలబెట్టుకునేనా?



జాతీయ రహదారులు 108 అడుగుల అన్నమయ్య విగ్రహం,



రాజంపేట పట్టణ ఏరియల్ వ్యూ,




14 ఎకరాల విస్తీర్ణంలో బ్రిటీష్ హయాంలోనే ఏర్పాటుచేసిన రాజంపేట సబ్ కలెక్టర్ రేట్

రాజంపేట, ఆగస్టు 24 ప్రభాతవార్త

ఎన్నికల సమయంలో కూటమినేతగా ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటను అన్నమయ్య జిల్లాగా ప్రకటించాలనే డిమాండ్ ఊపందుకుంది. ఈ ప్రాంతానికి చెందిన కూటమినేతలు ఉన్నత స్థాయిలో ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారు. స్వయంగా టిడిపి నేతలు ఉమ్మడి కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకురి, అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిలను కలిసి మెమొరాండం అందజేశారు. అంతేకాకుండా జిల్లా ఇన్చార్జ్ మంత్రి జనార్దన్ రెడ్డిని కూడా కలిసి రాజంపేటలో అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించాలని వినతిపత్రం అందజేశారు. మేధావులు, జిల్లా సాధన సమితి నేతలు, న్యాయమూర్తులు, వివిధ వర్గాల ప్రజలు పునర్వ్యవస్థీకరణ పై ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీకి కుప్పలు తెప్పలుగా రాజంపేట ను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ వినతులు పంపారు. ఈ నేపథ్యంలో రాజంపేట జిల్లా కేంద్రంగా ఉన్న అనుకూలతలపై సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. మంత్రుల కమిటీకి పంపిన వినతుల ఆధారంగా అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటకు ఉన్న వనరులు వివిధ అంశాలపై వార్త అందిస్తున్న ప్రత్యేక కథనమిది. 2022 లో పార్లమెంటరీ నియోజకవర్గాల ఆధారంగా జిల్లాలను విభజించారు. ఈ విభజన అనేక సమస్యలకు దారితీసింది. రాజంపేట, నరసాపూర్ , హిందూపూర్‌లకు వివిధ కారణాల వల్ల జిల్లా ప్రధాన కార్యాలయాల హోదా నిరాకరించబడింది. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల ఏర్పాటు, విభజన, మార్పు, విలీనం కోసం మంత్రుల బృందానికి సూచించబడిన విషయం లోను, మరీ ప్రతేకంగా మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె , పుంగనూరు నియోజకవర్గాలతో మదనపల్లె జిల్లా ఏర్పాటు ప్రతిపాదనను దృష్టిలో ఉంచుకుని, రాజంపేట, రాయచోటి, బద్వేల్ రైల్వే కోడూరు అసెంబ్లీ విభాగాలతో అన్నమయ్య జిల్లాను స్థాపించడానికి ఈ క్రింది అంశాలను పరిగణించాలని కోరుతున్నారు. రాజంపేటలోని తాళ్లపాక గ్రామంలో అన్నమయ్య జన్మించారు, ఆయన శ్రీ వెంకటేశ్వర స్వామిపై 32,000 కీర్తనలు రాశారు తెలుగు సాహిత్యంలో పద సాహిత్య రూపాన్ని అందించడంలో మార్గదర్శకుడు. అయన పేరునే జిల్లా ఏర్పడింది."ఆంధ్రుల చరిత్ర" లోని ఒక ప్రస్తావన ప్రకారం, చోళ రాజు "కరికాల చోళుడు" తన రాజ్యాన్ని విస్తరించడానికి రాజంపేటలోని పొత్తపి ప్రాంత అడవుల నరికి, ఆ తరువాత కడప వరకు విస్తరించాడని ఆ విస్తరణ కరికాల చోళుని పేరిట మొదట "కరిప" అని తరువాత కడపగా పిలువబడిందని చెబుతారు. హత్యారాలలోని పరశురామ ఆలయం మరియు నందలూరులోని సౌమ్యనాథ స్వామి ఆలయం గోడలపై ఉన్న తమిళ కుడ్య లిపి దీనికి నిదర్శనం. కాకతీయ సామ్రాజ్యంలో ప్రాంతాలను నాడులుగా వ్యవహరించేవారని తెలుస్తోంది. పొత్తపి నాడు కాకతీయ రాజ్యంలో నాడులలో భాగంగా ఉండేది. నందలూరు పూర్వం నెల్లూరును పాలించిన మనుమసిద్ధి పాలనలో ఒక వాణిజ్య పట్టణం, ఆయన వైష్ణవ మరియు శైవ సమూహాల మధ్య సామరస్యం కోసం కృషి చేశారు, ఇది నందలూరు, తాళ్లపాక మరియు హత్యారాలలో పక్కపక్కనే వైష్ణవ శైవ దేవాలయాల ఉనికి ద్వారా మళ్ళీ రుజువు అవుతుంది. మనుమసిద్ధి భార్య న్యాగమ హత్యారాల లో చేయ్యేటి వరద తాకిడికి గట్టు కోతకు గురి కాకుండా రాయితో అంచు కట్టించారని కూడా తెలుస్తున్నది. నందలూరు ఒకప్పుడు బౌద్ధ భావజాలానికి కేంద్రంగా ఉండేది, దీనికి గుహలు నిదర్శనం ఈ వారసత్వాన్ని తెలుపడానికి ప్రభుత్వం అడపూర్ సమీపంలో బౌద్ధ వారసత్వ ప్రదేశాన్ని నిర్మించింది.సుమతి శతక కర్త బద్దెన కవయిత్రి మొల్ల బద్వేల్ వాసులని తెలుస్తుంది.

## జిల్లా కేంద్రం మధ్యలో రాజంపేట

రాయచోటి, రాజంపేట,కోడూరు అనే మూడు నియోజకవర్గాలతో అన్నమయ్య జిల్లాకు కడప నుండి బద్వేల్ నియోజకవర్గాన్ని ప్రతిపాదించడం తో రాజంపేట సెంటర్ పాయింట్ అవుతుంది. బ్రిటిష్ వారి కాలం నుండి అన్నమయ్య జిల్లా ఏర్పడే వరకు బద్వేల్ రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో భాగంగా ఉంది. కోడూరు ,రాజంపేట సంస్కృతి, వ్యవసాయం ఉద్యానవనాలలో ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయి. పళ్ళతోటలకు రాష్ట్రంలోనే ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. మామిడి, బత్తాయి, అరటి , బొప్పాయి తోటలకు ప్రసిద్ధి చెందాయి. రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో భాగంగా సుదీర్ఘ అనుబంధం కారణంగా బద్వేల్ ఈ ప్రాంత ప్రజలతో దాదాపు ఒకేలాంటి సంస్కృతి బంధాన్ని కలిగి ఉంది. ఒంటిమిట్ట నుంచి దర్జీపల్లె ,పెన్న పేరూరు మీదుగా అట్లూరు వరకు రోడ్డు మార్గాన్ని నిర్మిస్తే బద్వేల్ రాజంపేటల మధ్య దూరం మరింత తగ్గడమే కాక పెన్నా పైన ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు అవుతుంది.

## ఆలయ పర్యాటక రంగం

అన్నమయ్య జిల్లా నాలుగు నియోజకవర్గాలు, రాజంపేట, రాయచోటి, బద్వేల్, కోడూరులో ఆలయ పర్యాటకానికి అవకాశం ఉంది. రాజంపేట తాళ్లపాక, అన్నమాచార్య జన్మస్థలం, చెన్నకేశవ, సిద్ధేశ్వర స్వామి దేవాలయాల తో కూడిన తిరుమల తిరుపతి దేవస్థానాల దత్తత గ్రామం. హత్యరాల, అరుదైన పరశురామ దేవాలయం గోపురం మరియు సరస్సుతో కూడిన కామాక్షిత్రేతేశ్వర స్వామి దేవాలయం.తిరుమల తిరుపతి దేవస్థానాలు దత్తత తీసుకున్న ప్రసిద్ధ సౌమ్యనాథ స్వామి ఆలయం ఉన్న పురాతన బౌద్ధ కేంద్రం నందలూరు. ఒంటిమిట్ట కోదండ రామ స్వామి దేవాలయం రాష్ట్రం రామ నవమి ఉత్సవాలను నిర్వహిస్తుంది, తిరుమల తిరుపతి దేవస్థానాలు దత్తత తీసుకున్న ఆలయం. కోడూరు శీతాకాలంలో కాలానుగుణ జలపాతాలతో కూడిన గుండాల కోన ఆలయం, చిట్వేల్, కొండపైన వీరభద్ర స్వామి ఆలయం విశాలమైన ప్రాంగణంలో వరదరాజ స్వామి ఆలయం. పైన పేర్కొన్న దేవాలయాలను పర్యాటకులకు ఒక పర్యాటక సర్క్యూట్‌గా రూపొందించవచ్చు.

## మౌలిక సదుపాయాలు:

బ్రిటిష్ వారి కాలం నుండి రాజంపేట రెవెన్యూ డివిజన్ ప్రధాన కార్యాలయంగా పరిపాలనా కేంద్రంగా ఉంది, దీనికి ఐఏఎస్ కేడర్ అధికారులు నాయకత్వం వహిస్తారు. కోడూరు, రాజంపేట , బద్వేల్ నియోజకవర్గాలు రాజంపేట రెవెన్యూ డివిజన్లో ఉండేవి. ప్రస్తుతం రాజంపేటలో కొంత ప్రాంతం కోడూరులు మాత్రమే ఉన్నాయి. రాజంపేటలో మౌలిక సదుపాయాలు దాదాపు 14 ఎకరాల విస్తీర్ణంలో సబ్‌కలెక్టరేట్ ఉంది.పట్టణం నడి బొడ్డున రెవెన్యూ కాంప్లెక్స్ ఉంది.చాలా డివిజనల్ కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి. పట్టణం నడిబొడ్డున 2 ఎకరాల విస్తీర్ణంలో ఏరియా ఆసుపత్రి.పట్టణం మధ్యలో ఏపీఎస్‌ఆర్టీసీ బస్ స్టేషన్ వర్క్‌షాప్ కాంప్లెక్స్.1871లో ముంబై మార్గం రైల్వే స్టేషన్, ఇప్పుడు ఆదర్శ్ పథకం కింద ఆధునీకరించబడింది . ఓబులవారిపల్లె కృష్ణపట్నం లైన్ ద్వారా హౌరాకు రైలు కనెక్టివిటీ. ప్రాంతీయవిమానాశ్రయం కడపలో 56 కి.మీ, అంతర్జాతీయం తిరుపతిలో 79 కి.మీ , చెన్నై 200 కి.మీ. ఓడరేవు కృష్ణపట్నం ఓడరేవు 130 కి.మీ. న్యాయ వ్యవస్థకు సంబంధించి జిల్లా అదనపు న్యాయస్థానం కిందిమూడు కోర్టులు ఉన్నాయి. జిల్లా ఏర్పాటుకి సంబంధించిన నాలుగు నియోజక వర్గాలు రాయచోటి రాజంపేట, కోడూరు బద్వేల్ లలో అనేక విద్య సంస్థలు ఉన్నాయి. రాజంపేటలో జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయ, ప్రభుత్వ రెసిడెన్సియల్ పాఠశాలలతో పాటుగా ప్రతి నియోజక వర్గంలో పాలిటెక్నిక్ కాలేజీలు, కోడూరులో ఉద్యానవన యూనివర్సిటీ మరియు రాజంపేటలో అన్నమయ్య డీమ్డ్ యూనివర్సిటీ ఉన్నాయి.

## మైనింగ్ కార్యకలాపాలు

మంగంపేటలో చమురు అన్వేషణ , వెలికితీతలో ఉపయోగించే బెరయిటీ (ముగ్గు రాయి) ఖనిజం గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతుంది. ఇక్కడే ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన పుల్లరి నిక్షేపాలు కూడా ఉన్నాయని ప్రాథమిక దర్యాప్తులో బయటపడింది. రాజంపేటలోని చైనా బంకమట్టిని దేశీయ సిరామిక్ పరిశ్రమలో ఉపయోగిస్తారు.శేషాచలం మరియు కడప సమీపంలోని పాలకొండ పర్వత శ్రేణులు ఒక వైపు, లంకమల వెలిగొండ అడవులు మరో వైపు ఈ ప్రాంతాన్ని అటవీ పర్యాటక ఆకర్షణకు నిలయంగా మారుస్తున్నాయి. ఇక్కడ డిమాండ్ ఉన్న ఎర్ర చందనం రసాయన పరిశ్రమలలో ఉపయోగించబడుతుంది. జిల్లా అటవీ కార్యాలయం ఇప్పటికే రాజంపేటలో ఉంది.ఈ ప్రాంతంలో పెన్నా, చెయ్యేరు, పాపాఘ్ని, మాండవ్య, పింఛా, సగిలేరు , గుంజన నదులు ఉన్నాయి .ఈ నదులపై వెలిగల్లు, పింఛ అన్నమయ్య సగిలేరు నీటిపారుదల ప్రాజెక్టులతో పాటుగా ప్రతిపాదిత గాలేరునగరి సుజల స్రవంతి బద్వేల్, రాజంపేట, కోడూరు మీదుగా గమ్యస్థానానికి చేరుకుంటుంది . ఈ ప్రాంతం విజయనగర సామ్రాజ్యం స్థాపించిన గొలుసు కట్టు చెరువుల నీటి పారుదల కింద ఉంది. సోమశిల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను రాజంపేట , కోడూరు నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలకు పంపింగ్ చేయడానికి కూడా అవకాశం ఉంది. నదీ పరీవాహక మండలంలో వరి విస్తారంగానూ, మిగతా ప్రాంతాలలో మామిడి, అరటి, బత్తాయి, నిమ్మ, బొప్పాయి వంటి ఉద్యానవన పంటలు, మెట్ట సాగులో నువ్వులు, పసుపు, రాగి, జొన్న, సజ్జ వంటి వాణిజ్య పంటలు పండుతాయి. గల్ఫ్‌లో వేలాది మంది పనిచేస్తూ విదేశీ కరెన్సీని సంపాదిస్తున్నారు. వందల కోట్ల విదేశీ మారకద్రవ్యం ఇక్కడ కనిపిస్తుంది. మదనపల్లె జిల్లాకు పోను మిగతా మిగిలిన అన్నమయ్య జిల్లా ఏర్పాటు కోసం ప్రతిపాదించబడిన నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు రాజంపేట, రాయచోటి, బద్వేల్ మరియు కోడూరులలో వేలాది మంది జనాభా అరేబియా గల్ఫ్ దేశాలైన కువైట్, దుబాయ్, ఖతార్, సౌదీ అరేబియా , యుఎఇలోని ఇతర దేశాలలో గత కొన్ని దశాబ్దాలుగా ఉపాధి పొందుతున్నారు. ఈ విధంగా గల్ఫ్ వెళ్లిన వారు రాజంపేట చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో ప్రతి గ్రామం లోను చెప్పుకోదగిన సంఖ్యలో ఉంటారు. వీరు దేశానికి ఉపయోగకరమైన విదేశీ కరెన్సీని సంపాదిస్తున్నారు వ్యవసాయ ఆధారిత , ఉద్యానవన ఆధారిత పరిశ్రమలకు విస్తృతమైన అవకాశం ఉంది. ఖనిజ సంపద కలిగిన ప్రాంతాలు, మౌలిక సదుపాయాలు మరియు విస్తారమైన మెట్ట భూములతో ఈ ప్రాంతం పరిశ్రమల అభివృద్ధికి మరియు సౌర విద్యుత్ ప్లాంట్లను స్థాపించడం ద్వారా సాంప్రదాయేతర ఇంధన ఉత్పత్తికి అత్యంత అనుకూలమైనది.పైన పేర్కొన్న వసతులు, సౌకర్యాలు ,వనరుల రీత్యా రాజంపేట, రాయచోటి, బద్వేల్, కోడూరు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి అన్నమయ్య జిల్లా ఏర్పాటు చేయడానికి చాల అనుకూలంగా ఉంటుంది. రాజంపేట జిల్లా ప్రధాన కేంద్రంగా చరిత్ర, సంస్కృతి, సహజ వనరులు , మౌలిక సదుపాయాలను కలిగి ఉండటం వలన పారిశ్రామిక అభివృద్ధికి కూడా అవకాశం ఉంది, ప్రభుత్వానికి అతి తక్కువ ఖర్చుతో జిల్లా కేంద్రం ఏర్పాటు చెయ్యడానికి రాజంపేట ఎంతో అనువైనది. ఈ నాలుగు నియోజక వర్గాలతో కూడిన అన్నమయ్య జిల్లా సామాజిక ఆర్థిక అభివృద్ధితో సుసంపన్నమైన జిల్లాగా రూపాంతరం చెందగలదని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు.

## శివశంకర నాయుడునీ పరామర్శించిన మున్సిపల్ ఇన్చార్జి

పులివెందుల, ఆగస్ట్ 24, ప్రభాత వార్త:



స్థానిక వెంకటాపురం గ్రామం లో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు నాయుడు సమీప బంధువు శివశంకర్ నాయుడు ఇటీవలి కాలంలో ప్రమాద వశాత్తూ గాయ పడటం జరిగింది హైదరాబాద్ ఆసుపత్రి లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన సందర్భంగా అతని ఇంటికి వెళ్లి మున్సిపల్ ఇంచార్జి వైయస్ మనోహర్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి లు పరామర్శించారు. ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి శంకర్ నాయుడు ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసు కోవడం జరిగింది.పార్టీ తరుపున అన్ని విదాలుగా ఆదుకుంటాం అని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆంజనేయులు నాయుడు, కో ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమోళి,గ్రామం లోని కార్యకర్తలు, ప్రజలు,తదితర పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

బద్వేలు అర్బన్, ఆగస్టు 24, ప్రభాత వార్త

శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై ఓ గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు మెరుగైన వైద్యం కోసం బద్వేల్ సీమాంక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతనికి వైద్యం చేయుచుండగా మృతి చెందినట్లు హాస్పిటల్ సూపరెండెంట్ సుబ్బారెడ్డి తెలియజేశారు. అయితే సదరు మృతుడు చాగలమరికి చెందిన భాష అని కొంత సమాచారం ఉంది. ఈ ఫోటోలో మృతి చెందిన వ్యక్తి ఎవరికైనా తెలిస్తే వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగలరని బద్వేల్ పోలీసులు తెలియజేశారు. సదరు వ్యక్తి మృతదేహం సీమాంక్ ఆసుపత్రిలో ఉందని పోలీసులు తెలిపారు.

## అనాధ వృద్ధులకు వస్త్రాలు ఉచిత మెడిసిన్ వితరణ




బద్వేల్ అర్బన్ ఆగస్టు 24 ప్రభాతవార్త :

బద్వేలు పట్టణంలోని అవోపా కమిటీ అధ్యక్షులు నూకల రెడ్డయ్య సెక్రటరీ సి.వి నాగేశ్వరరావు మరియు పలువురు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలు నుంచి నిరుపేద వైశ్యులకు దాతల సహాయ సహకారంతో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టి తమ మానవత్వాన్ని చాటుకోవడం పట్ల పలువురు వారి సేవలను అభినందించడం జరిగింది, ఆదివారం బద్వేల్ నియోజకవర్గంలోని ఓబులాపురం వద్ద ఉన్నటువంటి వివేకానంద సేవాశ్రమంను అవోపా కమిటీ సందర్శించడం జరిగింది, ఆశ్రమంలో ఉన్నటువంటి పలువురికి దాతల సహాయ సహకారాలతో అనాధ వృద్ధులకు బెడ్ షర్ట్స్, పంచలు, టవర్లు చీరలు తినుబండారాలు అలాగే రెక్సర్ ఫార్మా కంపెనీ వారి సహకారంతో పలురకాల వ్యాధులకు సంబంధించిన ఉచిత మందులను ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి చేతికి అందజేయడం జరిగింది, ఈ సందర్భంగా ఆవోప కమిటీ అధ్యక్షులు నూకల రెడ్డయ్య సెక్రటరీ సి,వి నాగేశ్వరరావు లు మాట్లాడుతూ అనేక రకాలుగా ఆసరా కోల్పోయిన అనాధ వృద్ధులను అక్కున చేర్చుకుని వారి బాగోగులు చూసుకుంటూ నిరంతరాయంగా సేవలు అందించుతున్న వివేకనంద ఆశ్రమం నిర్వాహకులు పాపిజెన్ని రామ కృష్ణారెడ్డి సేవలు మరువలేని అన్నారు, ఆశ్రమంలో ఉన్నటువంటి పలువురికి ఆవోప కమిటీ తరపున చిన్నపాటి సహాయాన్ని అందించడం తమకు ఎంతో సంతోషకరంగా ఉందన్నారు, రాబోవు రోజుల్లో ఆశ్రమానికి అవోపా కమిటీ తరఫున అనేక రకాల సేవా కార్యక్రమాలు అందజేస్తామని వారు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు సుబ్బారావు, గౌరవ సభ్యులు శ్రీరాములు తోపాటు పలువురు పాల్గొన్నారు

## స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల సమావేశం..



సుండుపల్లె, ఆగస్టు 24, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఎంపీపీ పాఠశాల నందు 24వ తేదీ ఉదయం10 గంటలకు ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల సమావేశము సుబ్బరామ రాజు అధ్యక్షతన సమావేశము నిర్వహించడమైనది. ఈ సమావేశమునకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి పి సి రెడ్డిన్న, జిల్లా అధ్యక్షుడు బి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి వి రెడ్డి కుమార్, తాలూక ప్రధాన కార్యదర్శి పి ఈశ్వరయ్య, మరియు జిల్లా నాయకులు బి రామచంద్ర, అల్లా ప్రకాష్ మరియు గుదిబండ్ల శ్రీనివాసులు హాజరు కావడం అయినది. ఈ సమావేశము నందు క్రింది సభ్యులను హాజరైన పెన్షనర్స్ అందరు అనుమతి మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. సమావేశమందు పెన్షనర్ల సమస్యలను పరిష్కరించుటకు సమ్మతి తెలియజేయడమైనది.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ను కలిసిన రమేష్

రాజంపేట, ఆగస్టు 24 ప్రభాతవార్త:

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్ ను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొత్తగా నియమితులైన నాగోతు రమేష్ నాయుడు ఆదివారం కలిశారు. వైజాగ్ లో జరిగిన ఓ రాష్ట్ర అధ్యక్షుడుతో కలిసి కలిసిరమేష్ నాయుడు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనుకు అవకాశం కల్పించినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న రమేష్ నాయుడుకు పార్టీలో పదోన్నతి కల్పించారు. పార్టీ విధుల్లో చురుగ్గా పాల్గొనడం, ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించడం, పార్టీ శ్రేణులతో తో సత్సంబంధాలు కొనసాగించడం ద్వారా ప్రధాన కార్యదర్శి పదవికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో పనిచేసే పార్టీ పురోభివృద్ధికి పాటుపడుతున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపిక రమేష్ నాయుడును పలువురు పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# గ్రామీణ ప్రాంతాల్లో మొదలైన సందడి

కడప, ఆగస్టు 24, ప్రభాతవార్త :

అదిగో ఇదిగో అంటూనే ఏడాది పూర్తయింది. వినాయకచవితి వేడుకలు అత్యంత ఉల్లాసాన్ని నింపుతాయి. అందులో నిమజ్జనం వేడుకలు భారీ రంజుగా ఉంటాయి. డప్పు, వాయిద్యాలతో రంగులు చల్లుకుంటూ కేరింతలు, కేకలు, నృత్యాలు వంటి వినోదాలు ఎంతో ఆకట్టుకుంటాయి, పిల్లాపాపలు మొదలుకొని పెద్దల వరకు ఈ గణేష్ ఉత్సవాల్లో పాల్గొనడం విశేషం. ఇక ఉండ్రాలయ్య దండాలయ్యా అలాగే జై జై గణేశా... జై కొడతా గణేశా వరములివ్వు బుజ్జి గణేశా ఈ పాట వింటే వినాయచవితి పండుగ గుర్తుకు వస్తుంది. ఈ వేడుకలు గ్రామీణ ప్రాంతాల్లో మొదలయ్యాయి. ఏ పల్లెలో చూసినా సందడి కనిపిస్తోంది. వినాయకచవితి పండుగ వస్తోందంటే అటు పట్నం నుంచి ఇటు పల్లె వరకు ఒకటే సందడి కనిపిస్తుంది. సాధారణంగా పండుగ రోజున చలువ పందిళ్లతో ప్రత్యేక మండపాలుఏర్పాటు చేస్తారు. ఈ దఫా మాత్రం పండుగకు రెండు, మూడు రోజులు ముందుగానే మండపాలు సిద్ధం చేశారు. పండుగ రోజున ప్రత్యేక మండపాలలో వినాయకచవితి ప్రతిమకు ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. మూడు లేదా ఐదు రోజుల తర్వాత గణేష్ నిమజ్జంతో చవితి వేడుకలు ముగుస్తాయి. అన్నివర్గాల ప్రజలు ఏకమై రంగులు జల్లుకుంటూ డప్పు వాయిద్యాలతో గణేష్ ఊరేగింపు కార్యక్రమం అద్భుతంగా ఉంటుంది. వినాయకచవితి పండుగ గురించి ఒక్కసారి అవలోకన చేసుకుందాం.

ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ప్రధాన పండుగగా గుర్తింపు ఉంది. హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాలలో నిర్వహించే గణేష్ నిమజ్జనాన్ని దేశప్రజలందరూ ఆసక్తిగా వీక్షిస్తారు అంటే అతిశయోక్తి లేదు. అప్పుడు దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా గొప్ప వేడుక జరుగుతోంది. పరిపూర్ణతకు మారుపేరుగా వినాయకుని పూజించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే వినాయకుడు పవిత్రతకు, విజయానికి మారుపేరుగా నిలిచినట్లు శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు చెబుతున్నాయి. అందుకే ఏ పనులు చేపట్టినా ఎటువంటి ప్రాజెక్టులు చేపట్టినా విజయవంతం కావాలని విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహిస్తారు. అలాగే యజ్ఞాలు, యాగాలు, క్రతువులు తలపెట్టినా కూడా ప్రారంభం సమయంలో వినాయకుడిని పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ఫలితంగా వినాయకుడే దగ్గర ఉండి ఎటువంటి తప్పిదాలు జరుగకుండా తలపెట్టిన కార్యాలను విఘ్నం లేకుండా పూర్తి చేయడంలో సహాయం చేస్తారని భక్తుల నమ్మకం. అందరికీ వినాయకుడిని ఆది దేవుడిగా ప్రజలు కొలుస్తారు. రంగస్థలం నాటకాలు, చెక్కభజనలు, కోలాటాలు వంటి కార్యక్రమాల్లో కూడా ప్రారంభసమయంలో వినాయకుడిని ప్రార్థించడం జరుగుతోంది. అంతేకాకుండా వినాయకుడి గురించి శ్లోకాలు చదవడం, వినడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించగలరని శాస్త్రాలు చెబుతున్నాయి. శివపార్వతుల కుమారుడైన వినాయకుడు సంవత్సరంలో ఒక రోజు అతిథిగా వచ్చి పది రోజుల పాటు మనతో సంతోషంగా గడిపి వెళ్లారనేది కథ వాడుకలో వుంది. అలాగే



ఎటువంటి విఘ్నాలు లేకుండా ప్రతిరోజు దేవుడికి పూజ చేసే ముందు ప్రధానంగా వినాయకుడి శ్లోకం ప్రారంభించడం ఆనవాయితీగానే కాకుండా సంప్రదాయంగా కూడా వస్తూ ఉంది. వినాయకచవితి సందర్భంగా ప్రతిమలను కొనుగోలు చేయదలచిన వారు విగ్రహంలో తొండం ఎడమవైపున వుండేలా చూసుకోవాలి. ప్రస్తుత పర్యావరణ పరిస్థితుల నేపథ్యంలో వినాయకుడి ప్రతిమను మట్టితో తయారు చేసిన వాటినే వినియోగించాలని ప్రభుత్వం కోరుతోంది. ఆ దిశగా అందరూ మట్టి వినాయక ప్రతిమలను వినియోగిస్తారని ఆశిద్దాం.

## కనుల పండగగా వెంకయ్య స్వామి ఆరాధన మహోత్సవం

బద్వేల్ అర్బన్, ఆగస్టు 24 ప్రభాతవార్త :



బద్వేల్ మున్సిపాలిటీ పరిధి సాయిబాబా గుడికి పై భాగమున అనంతగిరి క్షేత్రం నందు వెలసిన భగవాన్ శ్రీశ్రీశ్రీ వెంకయ్య స్వామి వారి 14 ఆరాధన మహోత్సవ కార్యక్రమం అది వారం వైభవంగా నిర్వహించారు,ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో వెంకయ్య స్వామివారికి తెల్లవారుజామునుండే వివిధ రకాల ప్రత్యేక పూజలను నిర్వహించారు, అనంతరం లక్ష్మీ గణపతి హోమం, చండీ హెమం, రుద్ర హెమం, లక్ష్మీనారాయణ గాయత్రి హోమం, నవగ్రహ హెమం, సుదర్శన హెమం, తో పాటు మహా పూర్ణహుతి కార్యక్రమాలను వేద పండితులు పలుగురాళ్లపల్లె సుబ్బరామ శర్మ గారి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు, అనంతరం స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షులు సముద్రాల దత్తాత్రేయ, సెక్రటరీ బోవిల యానాదిరెడ్డి, ట్రెజరర్ బిజి వేముల సుబ్బారెడ్డి, మరియు కమిటీ సభ్యులు భోవిల్ల రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, గురువారెడ్డి,బోలా నారాయణ, గాజులపల్లి కృష్ణయ్య, శేఖర్ రెడ్డి, విశ్వేశ్వరరావు, విజయకుమార్,తో పాటు పలువురు కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్ల తోపాటు తీర్థప్రసాదాలను అందజేశారు, అనంతరం సాయంకాలం పలు ప్రధాన రహదారుల్లో శ్రీ శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారు మెరమణి ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు, స్వామివారికి భక్తులు అడుగడుగునా నీళ్లు వారి పోసి కాయ కర్పూరం సమర్పించి మొక్కలను తీర్చుకున్నారు గ్రామస్తం వెంబడి సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టు కునే విధంగా నిలిచాయి, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం వైస్ ప్రెసిడెంట్ మునగా చలమయ్య కనుమర్లపుటి లక్ష్మయ్య, సోమిరెడ్డి పల్లె సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు నేలటూరి సుబ్బిరెడ్డి, మునగ హరి కందుకూరి రమేష్, నాగేంద్ర, జూటూరు రవికుమార్ కళ్యాణి, సముద్రాల రాజేంద్ర సౌజన్యతోపాటు పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు, స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు రైల్వే కాంట్రాక్టర్ కాంట్రాక్టర్ చిన్ రెడ్డి శ్రీనివాసులురెడ్డి అరవ శ్రీనివాసులురెడ్డి ఆరవ రమణారెడ్డి, సాంబశివరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



## సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ పరిశీలన

కడప, ఆగస్టు 24, ప్రభాతవార్త :

చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని జెడ్పి హైస్కూల్ ఆవరణలో అధునాతన వసతులతో నిర్మించిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి... సెప్టెంబర్ 2న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో.. నూతన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ ను రాష్ట్ర మంత్రిచే ప్రారంభించేందుకు సన్నాహక ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కోసం ఏర్పాటు చేసిన ఆటోమేషన్ సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ కు సంబంధించి.. వంట సామాన్లు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్... సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ ప్రారంభోత్సవానికి హాజరయ్యే రాష్ట్ర మంత్రి వెంట పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వారితోపాటు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉండడంతో.. పాఠశాల ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీతో చర్చించిన జిల్లా కలెక్టర్... కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్న.. కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, డీఈవో షంషుద్దీన్, ఆగ్రోస్ డిఎం జోయల్ విజయ్ కుమార్, ఎస్ఎస్ఏ, సంబందిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ, రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు.



## అన్నదానం మహాదానం.



రామాపురం, ఆగస్టు 24. ప్రభాతవార్త

అన్నదానం మహాదానం అని మండలంలోని రాచపల్లికి చెందిన గడ్డం వెంకట శివారెడ్డి అన్నారు. బండపల్లి వృద్ధాశ్రమం నందు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగిన్దన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులైన మేనల్లుడు గడ్డం వెంకటసివారెడ్డి, అల్లుడు రాంబాసిరెడ్డి, కుమార్తెలు, వెంకట సుబ్బమ్మ, బాలనాగమ్మ, మనవడు టి.శివప్రసాద్ రెడ్డి, మనవరాలు గాయత్రి పాల్గొన్నారు.

## తంబళ్లపల్లె రోడ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



తంబళ్లపల్లె ఆగస్టు 24 ప్రభాతవార్త ః

నియోజకవర్గంలో గత వైకాపా పాలనలో మరమ్మతులకు నోచుకోని రోడ్ల అభివృద్ధి కోసం మనసా వాచా కట్టుబడి ఉన్నానని తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి హర్షద్వారాల మధ్య ప్రకటించారు. ఆదివారం ఆయన నియోజకవర్గంలోని పీటీఎం మండలం బెట్టకొండ రోడ్డుకు రూ 3.71 కోట్లు, మొలకలచెరువు మండలంలోని గూడుపల్లి రోడ్డు రూ5.54 కోట్లు, కాల్వపల్లి రోడ్డుకు రూ 7.03 కోట్లు, తంబళ్లపల్లె నుండి కోసువారిపల్లె రోడ్డుకు రూ7.65 కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సంబంధిత గ్రామాల ప్రజలు జయచంద్రారెడ్డికి పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికి గత వైకాపా పాలనలో గతుకుల రోడ్లతో ఇబ్బందులు పడ్డామని నేడు కూటమి ప్రభుత్వం రోడ్డు నిర్మాణాలు చేపట్టడం హర్షనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం చేయడంతో పాటు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రోటోకాల్ పాటించిన ఘనత మాదేనన్నారు. ఆయన వెంట సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, కాంట్రాక్టర్ కృష్ణమోహన్ నాయుడు, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్, బేరీ శ్రీనివాసులు, మాజీ జెడ్పిటిసి రామచంద్ర, పురుషోత్తం, వీరాంజనేయులు, సోమశేఖర్, ఆనంద్, లక్ష్మీనారాయణ నాయుడు, రెడ్డప్ప నాయుడు, నాగేంద్ర నాయుడు, నిజాముద్దీన్, పీర్ల మాబు,జగదీష్, భాస్కర్, అల్లావుద్దీన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే నల్లారి ధ్యేయం

పీలేరు ఆగస్టు 24 ప్రభాతవార్త:



పీలేరు నియోజకవర్గంలో ప్రజా సమస్యల కోసం అనునిత్యం అహర్నిశలు కృషి చేస్తూ కుల మతాలకతీతంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పనిచేస్తున్నారని తెలుగుదేశం పార్టీ మైనార్టీ యువ నాయకులు నల్లారి రియాజ్ అన్నారు. ఆదివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాలలో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టి శాసనసభ్యులు కోట్ల రూపాయలతో అనేక రకాల పనులలో భాగంగా సిసి రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులతోపాటు మైనార్టీ సంక్షేమ కోసం కోట్ల రూపాయలతో మైనార్టీల అభివృద్ధికి షాది మహాల్లో ప్రహరీ గోడలు తోపాటు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఇప్పటికే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అనేక రకాల ప్రభుత్వ కార్యక్రమాలలో భాగంగా నిధులు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందని ఆయన తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



రామసముద్రం ఆగస్టు24 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కేసీ పల్లె జిల్లా ఉన్నత పాఠశాలలో 2014, 15 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని వారి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ మీకు విద్యాబుద్ధులు నేర్పిన మీరు ఎంతో మంది ఇప్పుడు ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని చాలా ఆనందంగా ఉందన్నారు. మీకు విద్యా బుద్ధులు నేర్పిన మాకు ఇన్ని సంవత్సరాలు గుర్తు పెట్టుకుని మాకు సత్కారం చేయడం చాలా సంతోషం గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేశవ రెడ్డి, చంద్రశేఖర్ అధ్యాపకులు పూర్వ విద్యా ర్థులు పాఠశాలకు నీటి పరిశుద్ధ యంత్రం, క్రీడా సామాగ్రి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రమణారెడ్డి, లీలావతమ్మ, శైలజకుమారి, బారతి, వేణు, మాదవి, చంద్రశేఖర్, రెడ్డెప్ప, శారధమ్మ, వెంకటరత్నమ్మ, దామోదర్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

మదనపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త :

భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) అగ్రనేత, కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి, ప్రగతిశీల, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరలని లోటని విడుదలై చిరుతైగల్‌కట్చి(వీసికేపార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ తెలియజేశారు. సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ, ఆదివారం స్థానిక బాస్ కార్యాలయం వద్ద సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని వీసీకే పార్టీ భారతీయ అంబేద్కర్‌సేన (బాస్) సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాస్ నాయకులు మాట్లాడుతూ కామ్రేడ్ సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాలులర్పించారు. కామ్రేడ్ సుధాకర్‌రెడ్డికి జోహార్లు తెలుపుతూ నినాదాలు చేశారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శిగా రెండు పర్యాయాలు, లోకసభ సభ్యునిగా పనిచేసిన ఆయన దేశానికి చిరస్మరణీయమైన సేవలు అందించారని తెలిపారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించి, వారి కుటుంబసభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గణపతి, ముత్యాలమోహన్, నీరుగట్టి రమణ, దొరస్వామి, బయన్న, రెడ్డెప్ప, డేగాని రమణ, జివి.రమణ, రవిశంకర్, గంగాధర్, బండకోట రవి, తలారి క్రిష్ణ, తెట్టు శ్రీనివాసులు, వినోద్, గోఫి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సంస్మరణ సభ నిర్వహించిన దృశ్యం

## అనుమతులు తప్పనిసరి



బ్రహ్మంగారిమఠం ఆగస్టు 24, ప్రభాతవార్త

వినాయక మండపాలు ఏర్పాటుకు అనుమతులు తప్పని సరిగా పొందాలని బి.మఠం ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. పోలీస్, విద్యుత్ తదితర శాఖలతో అనుమతి ఉండాలన్నారు. అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవని, ఎవరైనా అతిక్రమించి ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలకు గురవుతారని తెలిపారు. మండపం పరిసర ప్రాంతాల్లో మరియు నిమజ్జనం దగ్గర చిన్నపిల్లలను తీసుకెళ్ళ వద్దని సూచించారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిమజ్జనం నిమిత్తం వెళ్ళే ప్రతి వాహనానికి రికార్డు ఖచ్చితంగా ఉండాలన్నారు. కుల మతాలకు అతీతంగా పండుగను సంతోషంగా జరుపుకోవాలని వారు కోరారు. వినాయక ఉత్సవాలకు అనుమతుల కోసం ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రత్యేకంగా ganeshutsav.net అనే వెబ్సైట్ ను ఏర్పాటు చేసింది. అనుమతులు కావాల్సిన వారు ఈ వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవలెను అని ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

## కనుమ పోలేరమ్మ అమ్మవారి రథోత్సవం



బ్రహ్మంగారిమఠం ఆగస్టు 24 ప్రభాతవార్త ;

ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారికి నిప్పు తెచ్చిన శ్రీ కనుమ పోలేరమ్మ ఆలయం వద్ద ప్రతి ఆదివారం, శుక్రవారం, మంగ్లవారం రోజున శ్రీ అమ్మవారి గుడి చుట్టూ శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారిని ఊరేగింపుగా రథోత్సవంను దేవాదాయ శాఖ కమిషనర్ రామ చంద్రమోహన్ ఆదేశాల మేరకు రథోత్సవాన్ని నిర్వహిస్తున్నామని మేనేజర్ ఈశ్వరయ్య చారి అన్నారు. ఆదివారం ఉభయ దాతలైనా నంద్యాల జిల్లా బనగాన పల్లె వాస్తవ్యులు నాగేంద్ర రెడ్డి ధర్మపత్ని మాధవి రెడ్డి, రథోత్సవం ను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ప్రసాద్ పూజారి,మిథున్ పూజారి,సిబ్బంది చిన్న సుబ్బారాయుడు, శ్రీనివాసులు, భక్తులు తదితరులు పాల్గొన్ని రథోత్సవంను జయపదం చేశారు.

## "ఓట్ చోర్ గద్ది చోడ్" నిరసన ర్యాలీ



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దృశ్యం

పీలేరు ఆగస్టు 24 ప్రభాతవార్త ;

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న "ఓట్ చోర్ గద్ది చోడ్" ఉద్యమంలో భాగంగా ఆదివారం పీలేరు పట్టణంలోని విస్తృత స్థాయిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. బిఆర్ అంబేద్కర్ సర్కిల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, "రాజ్యాంగాన్ని విచ్చిన్నం చేస్తూ మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని గత ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ తో కలిసి దొంగ ఓట్లతో బీజేపీ ప్రభుత్వం కుమ్మక్కు అయిందని దీనికి సంబంధించిన పూర్తి సాక్షాలను రాహుల్ గాంధీ స్వయంగా బెంగళూరులో 90 నిమిషాలపాటు ప్రెస్ మీట్ లో వివరించారని అన్నారు. ఉన్న ఓట్లు తొలగించి లేని ఓట్లు యాడ్ చేయడం ద్వారా ఎన్నికల్లో గెలుపొందారు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శిస్తూనే వస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని కాపా డుతుందని మరియు ఓటరు హక్కులను మన చివరి శ్వాస వరకు కాపాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు.

## మృతురాలి కుటుంబసభ్యులకు సంతాపం

నిమ్మనపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త:



ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే

నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె వైకాపా సీనియర్ నాయకులు సురేంద్రరెడ్డి కోడలు శ్రీధర్‌రెడ్డి భార్య అకస్మికంగా మృతి చెందడంపై మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి ఆదివారం వెంగంవారిపల్లెను సందర్శించి మృతురాలి కుమారిన్ని ఓదార్చాడు. వెంగంవారిపల్లెకు చేరకొన్న మాజీ ఎమ్మెల్యే మృతిరాలి బౌతికకాయానికి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.

## జూదం ఆడుతున్న ఆరుగురు అరెస్టు

నిమ్మనపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలం అగ్రహారం గ్రామ పంచాయితీ సమీపంలో జూదం ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ తిప్పేస్వామి తమ సిబ్బందితో వెళ్లి ఆరుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.6200లు నగదు స్వాదీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు.

## పేకాటరాయుళ్ళు ఐదుగురు అరెస్టు

నిమ్మనపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలం అదే పంచాయతీలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుమందిని తమ సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకొని వారి వద్దనుంచి రూ.5100 స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

## పెన్షనర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

రాజంపేట, ఆగస్టు24 ప్రభాతవార్త

ప్రభుత్వ పెన్షనర్ల రాజంపేట మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షునిగా బాసినేని వేణుగోపాల్ నాయుడు, సహ అధ్యక్షుడుగా రాజేశ్వరరావు, ఉదయ్ భాస్కర్ రాజు, ఉపాధ్యక్షులుగా నారాయణ, చెంగల్ రాజు, రామచంద్ర, పోలయ్య, ప్రధాన కార్యదర్శిగా ఉమామహేశ్వర రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా సుబ్బ నరసయ్య, కోశాధికారిగా సత్యనారాయణ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెన్షనర్ల మండల శాఖ గౌరవాధ్యక్షులుగా ఎల్. శ్రీనివాసులు ఎంపికయ్యారు. ఈ సమావేశం లో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ రెడ్డి, తిరుపతి అధ్యక్షులు శంకర్, సహాధ్యక్షులు గోపాల్, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ విగ్రహాలకు అనుమతి తప్పనిసరి



చాపాడు. ఆగస్టు 24. ప్రభాతవార్త:

ఈనెల 27న జరగనున్న వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా గ్రామాలలో విగ్రహాలు నిలుపుటకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణము నందు శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినాయక చవితి ఉత్సవాల ఏర్పాటుకు తీసుకోవలసిన సూచనలు సలహాలు జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలి

నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్,



మైదుకూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త:

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో జోసఫ్ పేట, శాంతి నగర్ వాసులకు తాగునీటి బోర్లు రిపేరు రావడంతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు యూనిట్ ఇన్చార్జి తుపాకుల రమణ ఆధ్వర్యంలో 24 గంటల్లోనే రిపేర్ చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిపేరు చేసి తాగునీటిని వదలడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కక్ష సాధింపులో భాగమే ఎంపీ అక్రమ అరెస్ట్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సర్పంచ్ హబీబ్ బాషా, వార్డుమెంబర్లు

పీలేరు ఆగస్టు 24 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు లో భాగంగానే రాజంపే ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబా బాషా అన్నారు. ఆదివారం ఎంపీ అక్రమ నిర్బంధానికి 37వ రోజు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ కల్గిన పెద్దిరెడ్డి కుటుంబంపై అక్రమ కేసులు బనాయించడం, వేదించడం రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగమేనని విమర్శించారు. తామంతా పెద్దిరెడ్డి కుటుంబం వెన్నంటే ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఆబిద్, నాగభూషణం, ఉదయ్ కుమార్, నాగభూషణం. మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, సచిన్, కాలేషా. విక్టరీ వెంకటరమణారెడ్డి, శ్రీనాథరెడ్డి, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక ప్రదేశాలలో తనిఖీలు



సిద్ధవటం ఆగస్టు 24 ప్రభాతవార్త

లంకమల అభయారణ్యంలోని సమస్యాత్మక ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహించినట్లు సిద్ధవటం రేంజర్ బి కళావతి తెలిపారు. సిద్ధవటం అటవీ శాఖ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ కడప, డీఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదేశాలతో ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రోళ్ళబోడు, గొల్లపల్లి, సిద్ధవటం బీట్లలోని సమస్యాత్మక ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతంలోని సమీప గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు, కనబడితే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అటవీ సంపద కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచందనం ఇతర దేశాలకు తరలకుండా కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న పంట పొలాల్లోకి వన్యప్రాణులు సంచరిస్తే ఎటువంటి ప్రాణహానిని తలపెట్టకుండా గ్రామస్తులు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ఓబులేసు, ఫారెస్ట్ బీట్, సహాయ బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలను ఉత్సవంగానే నిర్వహించుకోవాలి



సమావేశం లో మాట్లాడుతున్న సీఐ యుగంధర్

పీలేరు అక్టోబర్ 24 ప్రభాతవార్త :

ఈ నెల 27 నుంచి జరుగనున్న వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని పీలేరు సీఐ యుగంధర్ అన్నారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పీలేరు ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వినాయక ఉత్సవాలు సామూహికంగా జరుపుకోవడం పీలేరులో ఆనవాయితీగా వస్తోందన్నారు. గణేష్ ఉత్సవం నిర్వహించడంలో హైదరాబాద్ తర్వాత పీలేరు రెండవ స్థానం ఉంది. ఇంత పెద్ద ఎత్తున జరిగే కార్యక్రమంలో అందరూ సమయపాలన పాటించాలన్నారు. ఉత్సవాలను ఉత్సవాలుగా జరుపుకోవాలని, అతిక్రమించి వచ్చే పోయేవారిపై రంగులు చల్లడం, కోడిగుడ్లు, టమోటాలు వేయడం లాంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ నెల 31న ఊరేగింపు, నిమజ్జనం ఉంటుందని, సుమారు వంద విగ్రహాలు ఊరేగింపు ఉంటుందని, పట్టణంలో రోడ్డు పనులు జరుగుతున్నాయని, వీలైనంత త్వరగా నిమజ్జనం అయ్యేలా భక్తులు, ప్రజలు సహకరించాలన్నారు. గణేష్ ఉత్సవాల్లో భక్తి పాటలు మాత్రమే పెట్టాలని సూచించారు. అశ్లీల నృత్యాలు నిషేదమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు. సెంటర్ల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## పార్సిల్ రవాణాలో విస్తృత తనిఖీలు

మైదుకూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:

గంజాయి రవాణాను నిషేధించాలనే ఉద్దేశంతో అన్ని ట్రాన్స్పోర్ట్ మరియు పార్సెల్ సర్వీసెస్‌లో తనిఖీలు నిర్వహించిన సిఐ కె.రమణారెడ్డి, అంతేకాకుండా అక్కడ ఉన్న యజమానులకు గంజాయి రవాణా గురించి ఏమైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, ఒకవేళ ఏమైనా పార్సెల్సు అనుమానంగా ఉంటే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని మైదుకూరు అర్బన్ ఇన్స్పెక్టర్ కె.రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రహదారి మరమ్మతులు ప్రారంభం



తొండూరు ఆగస్టు 24 ప్రభాతవార్త :

తొండూరు మండలంలోని ఊడవగండ్ల గ్రామంలో వర్షాల కారణంగా రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షపు నీరు నిలిచిపోవడంతో రోడ్లపై గుంతలు ఏర్పడి, గ్రామ ప్రజలు నిత్యంఇబ్బందులనుఎదుర్కొంటున్నారు ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, గర్భిణీలు, అత్యవసర సేవలకు వెళ్లే వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులను పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించిన సర్పంచ్ గ్రామ సర్పంచ్ దాసరి ప్రతిమ ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా రహదారుల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. "గ్రామ ప్రజలు పడుతున్న కష్టాలను తొలగించడం నా ప్రధాన కర్తవ్యం" అని ఆమె స్పష్టం చేశారు. అత్యవసర సమావేశం – తక్షణ చర్యల ఆదేశాలుగ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ, సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించి రహదారి మరమ్మతులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని ఆదేశించారు. తాత్కాలికంగా గుంతలను పూడ్చి, నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పైపులైన్ వద్ద దెబ్బతిన్న ప్రాంతాలను తక్షణం సరిచేయాలని చెప్పారు. శాశ్వత పరిష్కారానికి కృషి తాత్కాలిక మరమ్మతులతో పాటు, శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోనిధులనుసమీకరించేందుకు ప్రయత్నిస్తామని సర్పంచ్ తెలిపారు.

## నిరుద్యోగ భృతి మాటేమిటి ?

వేంపల్లి: ఆగస్టు 24 (ప్రభాత వార్త):



15 నెలలు ఆలస్యంగా అయినా సరే కూటమి ప్రభుత్వం తొలి సంతకమైన 16,347 టీచర్ పోస్టులకు సంబంధించిన మెగా డీఎస్సీని అమలు చేయడం హర్షనీయం. అదే సమయంలో సూపర్ సిక్స్ హామీల్లో మిగిలిపోయిన హామీల మాటేమిటి ? రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతినిరుద్యోగికి నెలకు 3000 రూపాయలు నిరుద్యోగ భృతి కింద ఇస్తామని కూటమి హామీ ఇవ్వడం జరిగింది .ఇప్పటికీ 14 నెలలు దాటింది .కానీ ఇంతవరకు మూడు రూపాయలు ఇవ్వలేదు. మరొక సూపర్ సిక్స్ హామీ ఆడబిడ్డ నిధి .19 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని మేనిఫెస్టో లోను ,సూపర్ సిక్స్ హామీలలోను కూటమి పేర్కొనడం జరిగింది. కనీసం వచ్చే సెప్టెంబర్ మాసం నుండి అయినా సరే బకాయిలతో సహా ఈ ఆడబిడ్డనిది హామీని అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా ఉంది.

## రాష్ట్ర , జిల్లా బాధ్యులుగా ఉపాధ్యాయులు

పీలేరు ఆగస్టు 24 ప్రభాతవార్త :



ఆదివారం అన్నమయ్య జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా ఎన్నికలు రాయచోటి బాలికలు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ ఎన్నికలలో జిల్లా కోశాధికారిగా వై వెంకటరమణ ప్రధానోపాధ్యాయులు కేవీ పల్లి మండలం, రాష్ట్ర కౌన్సిలర్ గా తాటిపర్తి గంగాధర్ ప్రధానోపాధ్యాయులు జంగంపల్లి మరియు రాయచోటి డివిజన్ కార్యదర్శిగా వై సురేంద్ర ప్రధానోపాధ్యాయులు మేళ్లచెరువు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని పీలేరు ప్రాంత ప్రధానోపాధ్యాయులు అన్నమయ్య జిల్లా ప్రధాన ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు. రాష్ట్ర మరియు జిల్లా బాధ్యులుగా పీలేరు మండల ప్రధానోపాధ్యాయులు కావడంతో మండల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

## సైక్లింగ్ యోగ కార్యక్రమంలో పాల్గొన్న కమాండెంట్



సిద్ధవటం ఆగస్టు 24 ప్రభాతవార్త

11వ పటాలములో సైకిల్ మరియు యోగకార్యక్రమము నిర్వహించబడినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 11 వ బెటాలియన్ కమాండెంట్ కె ఆనంద రెడ్డి హాజరయినారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ మిగిలిన అధికారులు మరియు సిబ్బందితో కలిసి సైకిల్ ర్యాలీ కార్యక్రమము నిర్వహించడం జరిగినది మరియు అందులో భాగంగానే యోగా కార్యక్రమం కూడా బెటాలియన్ గ్రౌండ్లో నిర్వహించడం జరిగినది. కమాండెంట్ కె ఆనంద రెడ్డి మాట్లాడుతూ దీని యొక్క ముఖ్య ఉద్దేశం ఏమి అనగా కాలుష్య నియంత్రణ కోసం ప్రజల్లో అవగాహన కలిగించడం. సైకిల్ వాడకం ద్వారా శరీరానికి దృఢత్వం, ఫిట్నెస్ పెంపొందించడం. ఆరోగ్యకరమైన, కాలుష్య రహిత జీవన విధానానికి ప్రోత్సాహం ఇవ్వడం. సైక్లింగ్ మరియు యోగా అభ్యాసాల ద్వారా ఆరోగ్యాన్ని సమర్థవంతంగా ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో ఆరోగ్యకరమైన మరియు సమతుల్య జీవనశైలిని పెంపొందించడంలో ఇటువంటి కార్యకలాపాల ప్రాముఖ్యతకు నిదర్శనం అని చెప్పడం జరిగినది ఈ కార్యాక్రమంలో కమాండెంట్ శ్రీ కె ఆనంద రెడ్డి , అసిస్టెంట్ కమాండెంట్/ డి.ఎస్.పి శ్రీ కె వెంకట రెడ్డి అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ పి రాజశేఖర్ బెటాలియన్ అధికారులు పోలీసులు పాల్గొన్నారు.

## 85.6మార్కులతో ఉపాధ్యాయులుగా రేణుక

రామసముద్రం ఆగస్టు 24 ప్రభాతవార్త



మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ మట్లవారిపల్లె గ్రామానికి చెందిన కె. వెంకటరమణా రెడ్డి, గిరిజమ్మ దంపతులకుమార్తె రేణుక 85.6 మార్కులతో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరు తండ్రి వెంకటరమణా రెడ్డి వ్యవసాయ కుటుంబం ఆయన మాట్లాడుతూ మాకుమార్తె చిన్నప్పటి నుంచి చదువు, ఆటల్లో చురుకుగా ఉండేదన్నారు. వ్యవసాయ పనుల్లో మాకు చేదోడు వాదోడుగా ఉండేవారని, ఈరోజు ఉపాధ్యాయురాలుగా ఎంపిక కావడంతో చాలా సంతోషంగా ఉందన్నారు. రేణుకాకు కుటుంబ సభ్యులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

## భూ వివాదంతో ఘర్షణ, ఒకరికి గాయాలు

మదనపల్లె క్రైమ్,ఆగస్టు 24 ప్రభాతవార్త.



భూ వివాదంతో జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లి మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి రూరల్ మండలం మాలేపాడు పంచాయతీకి చెందిన ఎర్రం కట్టప్ప కుమారుడు నాగరాజు (45) వంశపార్యపరంగా తనకు సంక్రమించిన పొలంలో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి అదే గ్రామానికి చెందిన చంద్ర, మల్లికార్జున, విశ్వనాధులతో భూ సమస్యలు ఉన్నాయి. ఆదివారం నాగరాజు పొలం వద్ద పనులు చేస్తుండగా చంద్ర, మల్లికార్జున, విశ్వనాధులు ఘర్షణ పడి డి అతన్ని చితకబాదారు. ఈ సంఘటనలో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇతని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం



**వేంపల్లె :ఆగష్టు 24:(ప్రభాత వార్త)**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నందు డిక్సన్ సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రం అభివృద్ధి దిశగా పెట్టుబడి పెట్టే కంపెనీలు వస్తున్నాయన్నారు. నియోజకవర్గ ఇంచార్జ్ బిటెక్ రవి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. సిఎం చంద్రబాబు సారధ్యంలో రాష్ట్రం ప్రగతి వైపు నడుస్తోందన్నారు. అనంతరం ఇంటర్వ్యూలో ఎంపికైన యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అలాగే జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ రామమునిరెడ్డి, సీనియర్ నేతలు షబ్బీర్, బాలస్వామిరెడ్డి,మైనారిటీ మండలకన్వీనర్ తెలంగాణ వలి, నాయకులు నాగభూషణం, బాలకృష్ణారెడ్డి, ఫయాజ్, వేమాకుమార్, రమేష్, మహమ్మద్, షరీఫ్, జబిల్లాహ్.తదితరులు పాల్గొన్నారు.

# స్టాల్స్ ఏర్పాటుకు అవకాశాలు కల్పిస్తాం




**కడప కార్పొరేషన్ ఆగస్టు 24 ప్రభాతవార్త:**

చేతి వృత్తులు వారికి, గవర్నమెంట్ గుర్తింపు పొందిన హ్యాండీక్రాఫ్ట్ కార్డుల వారికి తక్కువ ధరలకు స్టాల్స్ శిల్పారామంలో ఇస్తామని, అలాగే కొత్త గేమ్స్ ను ఏర్పాటు చేసుకోవచ్చునని శిల్పారామం ప్రత్యేకమైన అధికారి వి. స్వామి నాయుడు, చైర్ పర్సన్ చెరెడ్డి మంజులా రెడ్డిలు వెల్లడించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆదివారం కడప శిల్పారామంలో సా. 6 గం.లకు సాంస్కృతిక కళావేదిక మీద మిస్సా మూవీ వారి సహకారంతో కడప నగరానికి చెందిన ఏఎం.డాన్స్ అకాడమీ బృందం పల్లె జానపదాలు ముత్యాల ప్రదర్శించారు. వయ్యారి బాల వగలారే బాల, రాను రాను బొంబాయికి రాను అంటూ.. గణపతి పప్పా మోరియా ఒంటి పాటలకు నృత్యాలతో ప్రేక్షకులను అలరించినాయి. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి ఎస్ కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణ చేశారు.

# పోలి చెరువు మత్స్య కారుల వలలు, తెప్పలు దగ్ధం



**రాజంపేట, ఆగస్టు 24 ప్రభాతవార్త:**

రాజంపేట మండలం పోలి చెరువు ఒడ్డున మత్స్యకారులు ( యానాదులు) భద్రపరిచిన వలలు, బోట్లు తదితర సామాగ్రిని శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు.పోలీ ఎస్టీ కాలనీకి చెందిన ఏడు కుటుంబాలకు చెందిన వలలు, బోట్లు సుమారు డెబ్బై వేల రూపాయల సామాగ్రిని గుర్తు తెలియని దుండగులు కాల్చి బూడిద చేశారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి కారణాలు తెలియరాలేదు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి సికిందర్ బాధితుల తరపున మాట్లాడుతూ పోలీ ఎస్టి కాలనీకి సంబంధించిన యానాదులు కులవృత్తి అయినటువంటి చేపల వేట సామాగ్రిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారని వారికి తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మత్స్యకారుల సామాగ్రిని కాల్చిన వారిపై చర్యలు తీసుకొని వారిని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# నూతన కమిటీ ఎన్నిక



**జమ్మలమడుగు, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

జమ్మలమడుగులోని సంజామల మోటులో ఉన్న చక్రా ఫంక్షన్ హాలులో ఆదివారం జమ్మలమడుగు డిపో నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు పి.వి.శివారెడ్డి హాజరయ్యారు. డిపో ప్రెసిడెంట్ పి.బ్రహ్మం అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీని కడప రీజనల్ కార్యదర్శి సుధాకర్ ఉద్యోగుల కోరిక మేరకు జమ్మలమడుగు డిపో ప్రెసిడెంట్గా పి.బ్రహ్మంను, డిపో వైస్ ప్రెసిడెంట్గా రవిబాబును, వర్కింగ్ ప్రెసిడెంట్గా కాంతయ్యను, డిపో కార్యదర్శిగా ఎంజీసీఓ రెడ్డిని, డిపో అడిషనల్ కార్యదర్శిగా నాగేంద్రను ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సమావేశానికి డివిజనల్ ఛైర్మన్ శేషన్న, రీజనల్ ప్రెసిడెంట్ నాగముని, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# కేసీ కాలువలో బాలుడు గల్లంతు

**దువ్వూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన నాదెళ్ల షఫీక్ అనే 15 సంవత్సరాల బాలుడు కేసీ కాలువలో ప్రమాదవశాత్తు గల్లంతు అయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లెల్ల గ్రామానికి చెందిన షఫీక్ మండల కేంద్రమైన దువ్వూరులోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు 10వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో జిల్లెల్ల గ్రామంలోనే ఉన్నాడు. అతని తల్లితండ్రులు పొలానికి వెళ్లగా అతని స్నేహితులు కరీముల్లా, కళ్యాణ్ లతో కలిసి మోటార్ సైకిల్పై కలిసి కేసీ కెనాల్ కు సమీపంలో ఉన్న మాచమ్మ గుడి వద్దకు వెళ్లాడు. అక్కడ సమీపంలోని బ్రిడ్జి వద్ద తాపలు ఉండగా కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటూ ఉండగా కాలు జారి కాలువలో గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని కళ్యాణ్, కరీముల్లాలు సమీప పొలంలో ఉన్న రైతులకు తెలియజేశారు. వెంటనే వారు వచ్చి పరిశీలించగా చేతులు కొద్దిమేరా పైకి ఊపుకుంటూ కాలువలో వెళ్లి పోయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని షఫిక్ తండ్రి నాదెళ్ల మొహమ్మద్ కు తెలియజేశారు. వారు వచ్చి దువ్వూరు పోలీసుల సహాయంతో కేసి కాలువలో సాయంత్రం వరకు వెతికారు. అయినా బాలుని ఆచూకీ లభించలేదు. వెంటనే కేసీ కాలువ అధికారులకు సమాచారం అందించి కొద్దిసేపటి వరకు కాలువలో నీటి మట్టాన్ని తగ్గించారు. నీటిమట్టం తగ్గిన తర్వాత బాలుని ఆచూకీ లభిస్తుందని ఆశిస్తున్నారు. ఈ మేరకు బాలుని తండ్రి పోలీసులకు సమాచారం అందించారు.

# కోదండ రామాలయంలో ఆగమ శాస్త్ర ప్రకారం పవిత్ర ప్రతిష్ట







**ఒంటిమిట్ట ఆగస్టు 24( ప్రభాతవార్త)**

ఏకశిలానగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో పవిత్రోత్స వాలకు టిటిడి పరిరక్షణలో ఆలయ అర్చకులు శ్రీకారం చుట్టారు. రెండవ రోజు ఆదివారం పవిత్ర ప్రాణ ప్రతిష్ట శాస్త్రక్తంగా అర్చకులు నిర్వహించారు. శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను యాగశాలకు వేంచేపు చేశారు. విశ్వక్సే నుని ఆరాధన, పుణ్యావాచనము, బలిహరణ, పాత్తుర, కుంభారాధన, నివేదన, ఉక్త హోమాలను అర్చకులు నిర్వహించారు. యాగశాలలో పవిత్ర మాలలకు ఉపచారణలు చేసి ప్రదక్షిణ గావించి వేంచేపు చేశారు. ధ్రువమూర్తులకు, కౌతుకమూర్తులకు, స్నన మూర్తులకు, బలిమూర్తులకు, విశ్వక్సే నులకు, ద్వార పాలకులకు, ఆండాళ్వార్లకు యాగశాలలోని ,హోమ గుండాలకు, బలిపీఠలకు, ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు ఇవ్వాలి - సీఐటీయూ

**జమ్మలమడుగు, ఆగస్టు 24, ప్రభాతవార్త:**



డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు పెండింగ్లో ఉన్న గత 5 నెలల వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ పట్టణ గౌరవాధ్యక్షులు ఎ.వినయ్ కుమార్ సంయుక్త ప్రకటనలో జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. ముఖ్యంగా జూన్లో స్కూలు తెరుచుకున్నాయని గుర్తు చేశారు. ఇదే తరుణంలో శానిటేషన్ పరిస్థితి కూడా ఇలానే ఉండిన ఆశ్చర్యం లేదన్నారు. ముఖ్యంగా సెక్యూరిటీ గార్డులకు ఒక్క రోజు కూడా సెలవు ఇవ్వకపోవడం లేబర్ యాక్ట్కు భిన్నంగా చేయడమేనని తెలిపారు. 365 రోజులు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన సేవ సుప్రీం, తదితర కాంట్రాక్టర్ల కార్మికుల వేతనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. సెలవులు ఇవ్వకపోగా పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా కట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెక్యూరిటీ గార్డులకు కొత్త అగ్రిమెంటు ప్రకారం రూ.18600 ఇవ్వాల్సి ఉండగా వీరికి కేవలం రూ.7 వేల నుంచి రూ.8వేలు మధ్యలో ఇస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇలాంటి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటన్నిటిపై సోమవారం గ్రీవెన్స్లో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేస్తామన్నారు. అప్పటికీ వేతనాలు రాకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామన్నారు. వీటికి బాధ్యత జిల్లా రెసిడెన్షియల్ అధికారులదని తెలిపారు.

# తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం



**కలికిరి, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

కలికిరి మండలంలోని ఎస్సీ బాలుర హాస్టల్లో ఆదివారం తల్లిదండ్రుల కోసం ప్రత్యేకంగా అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాస్టల్ వార్డెన్ బి.రవీంద్ర అధ్యక్షత వహించగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్ డబ్ల్యూఓ ఎస్.కృష్ణ ప్రధాన అతిథిగా మాట్లాడారు. ప్రస్తుతం హాస్టల్లో లోకల్ మరియు నాన్ లోకల్ విద్యార్థులు భోజనం మాత్రమే హాస్టల్లో చేరి తిరిగి ఇళ్లకు వెళ్లిపోతున్నారని తెలిపారు. అటువంటి పరిస్థితి విద్యార్థుల చదువులో ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు హాస్టల్లోనే ఉండి నియమితమైన పాఠాలు, రాత్రి స్టడీ, ట్యూటర్స్ సహకారం పొందితే మాత్రమే మంచి ఫలితాలు సాధించగలరన్నారు. ఇంటికి తిరిగి వెళ్తూ ఉండడం వల్ల వారు తరచుగా చదువులో వెనకబడే అవకాశం ఉందని, పైగా అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం పెరుగుతుందని తల్లిదండ్రులను హెచ్చరించారు. కావునా ఇకపై ప్రతి విద్యార్థి హాస్టల్లోనే భోజనం చేసి ఇక్కడే వసతి గడపాలని సూచించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయిని జానం సుజాత మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు. పిల్లలకు క్రమశిక్షణ నేర్పడం, ఉపాధ్యాయులతో సమన్వయం కలిగి ఉండడం ద్వారా వారి భవిష్యత్తు బంగారు బాటలో నడవలగదని తెలిపారు. విద్యార్థులలోని ప్రతిభను వెలికి తీసేందుకు తల్లిదండ్రులు ఎల్లప్పుడూ ప్రోత్సాహకరమైన వాతావరణం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ బి.రవీంద్ర, ట్యూటర్ బి.సుబ్రమణ్యం, పాఠశాల సిబ్బంది, హాస్టల్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. చివరగా విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, భద్రత కోసం అందరూ కలిసి కృషి చేయాలని నిర్ణయించారు.

# బొప్పాయి రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం



**కలికిరి, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

బొప్పాయి రైతులకు బొప్పాయి విత్తనాలు అందేలా, అలాగే మామిడి మొక్కలు తామే సరఫరా చేసి రైతుల వద్ద నుంచి తామే గిట్టుబాటు ధరలకు కొని ఆదుకుంటామని ప్రొప్రైటర్లు షావల్లీ, ఎం.భాస్కర్, మహేష్బాయ్లు పేర్కొన్నారు. ఆదివారం కలికిరి-కలకడ రోడ్డు మార్గంలో రైతుల సౌకర్య నిమిత్తం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమయ్యారు. రైతులు బొప్పాయి, మామిడికి సంబంధించి గిట్టుబాటు ధరల గురించి చర్చించడం జరిగింది. రైతులకు ఆసక్తి గల విత్తనాలు మాత్రమే సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో బొప్పాయి, మామిడి, సాగు చేసిన రైతులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ప్రొప్రైటర్ షావల్లీ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి బొప్పాయి, మామిడి సమస్యలపై రైతులకు అవగాహన కల్పించి పంటలో రైతులకు అధిక దిగుబడి వచ్చేలా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదర్బాషా, ప్రతాప్, డి.కాలేషా, హజరత్, అనిల్, విశ్వ, రైతులు వెంకటేశ్వర్రెడ్డి, రమేష్రెడ్డి, వేణుగోపాల్రెడ్డి, రెడ్డప్ప, రాజగోపాల్రెడ్డి, పలువురు రైతులు హాజరు కావడం జరిగింది.

# శంకరాపురంలో గ్రామసభ

**ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ పరిధిలో గల శంకరాపురం గ్రామంలో ఆదివారం గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా గ్రామస్థులకు సైబర్ నేరాలు, ఫ్యాక్షన్ వల్ల కలిగే అనర్థాలు రాబోయే వినాయక చవితి పండగ గురించి కొన్ని జాగ్రత్తలు రూరల్ సీఐ బాల మద్దిలేటి వివరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



# పుల్లారెడ్డి పేటలో పెద్దమ్మ తల్లికి పూజలు



**దువ్వూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని పుల్లారెడ్డి పేట గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో జాతర కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్దమ్మ తల్లికి బోనాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో బంధువులు అందరికి విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వివిధ గ్రామాల నుండి వచ్చిన బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్ ఇండియాపై సైకిల్ ర్యాలీ



**దువ్వూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

స్థానిక పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎస్ఐ వినోద్ కుమార్, సిబ్బంది ఆదివారం ఫిట్ ఇండియా పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది ఆరోగ్యవంతంగా ఉండేందుకు సైకిల్ తొక్కాలని ఆదేశించారని, ఆ ఆదేశాల మేరకు ప్రతి పోలీసు సైకిల్ తొక్కారు. దీంతో ప్రజలు కూడా అవగాహన కల్పించుకొని సైకిల్ తొక్కడం వల్ల మంచి ఆరోగ్య వంతులుగా ఉంటారని ఎస్ఐ పేర్కొన్నారు. అలాగే సాయంత్రం మండల కేంద్రమైన దువ్వూరులోనూ, జాతీయ రహదారి పైనను వాహనాలను తనిఖీ చేసి జరిమానాలు విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# చవితి ఉత్సవాలకు దేవాలయాల ముస్తాబు



**పెనగలూరు ఆగస్టు 24 ప్రభాతవార్త**

ఈనెల 27న జరగనున్న వినాయక చవితి పర్వదినం ఉత్సవాలను జరుపుకునేందుకు పల్లి శ్రమలు సిద్ధమయ్యాయి. మండలంలోని పెనగలూరు పంచాయతీ పరిధిలోని ఇండ్లూరు, పి కొత్తపల్లి గ్రామాలలో నిర్మించిన విఘ్నేశ్వర స్వామి దేవాలయాలలో ఐదు రోజులపాటు ఘనంగా చవితి ఉత్సవాలను జరుపుకునేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఇల్లూరు లోని సిద్ధి వినాయక స్వామి దేవాలయం పి కొత్తపల్లి లోని కార్య సిద్ధి వినాయక స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు అన్నదానాలు, అల్పాహార ప్రసాదం పంపిణీ లతోపాటు లడ్డు ప్రసాదం సమర్పణ కార్యక్రమాలతో పాటు గ్రామోత్సవం వసంతోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకునేందుకు పలువురు భక్తులు దాతలు విరాళాల రూపంలో శ్రీవారి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి సిద్ధంగా ఉన్నారు. ఇదిలా ఉండగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో చవితి ఉత్సవాలను జరుపుకునేందుకు మండపాలను ఏర్పాటు చేసుకునియున్నారు.

# మానసిక దివ్యాంగులకు తీవ్ర అన్యాయం

**ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 24, ప్రభాతవార్త:**



సదరం వెరిఫికేషన్లో శారీరక వైకల్యంతో రెండు కాళ్లు సచ్చుబడిన, మానసిక దివ్యాంగులకు తీవ్ర అన్యాయం చేస్తోందని కూటమి ప్రభుత్వాన్ని ఆల్ ఆఫ్ యు దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అప్జల్ విమర్శించారు. ఆదివారం మున్సిపల్ పార్కు వద్ద ఆయన సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. దివ్యాంగుల ఆర్థిక భరోసా మీద గొడ్డలి పెట్టుగా తయారైందని పుట్టుకతో పోలియో వ్యాధితో కాళ్లు సచ్చుబడి మానసిక దివ్యాంగులకు పూర్తిగా నయం కాదు, వయసు పెరిగే కొద్ది శరీరం సహకరించక ఇబ్బంది పడుతున్నా శారీరక వికలాంగులకు వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం సుదీర్ఘ కాలంగా అంగవైకల్యంతో తీసుకుంటున్న అర్హులైన దివ్యాంగుల పింఛన్లను రద్దు చేయడం బాధాకరమని తెలిపారు. సదరం సర్టిఫికెట్లో జరిగిన తప్పులు సవరించడానికి అవకాశం ఇస్తున్నట్లు ఆప్షన్ ఇవ్వడానికి ఆయన ప్రయత్నం చేయలేదు. ప్రభుత్వం ఏ ఒక్కరికి పింఛన్లు తీసేయలేదని డబ్బా కొట్టుకోవడం తప్ప ఏమీలేదన్నారు. ఈ సదరం వెరిఫికేషన్లో చాలా మంది శారీరక, మానసిక ఆర్థోపెడిక్ వారికి తీవ్రమైన అన్యాయం జరిగింది. ప్రభుత్వం రీ వెరిఫికేషన్ నందు కొత్త సదరం సర్టిఫికెట్లలో జరిగిన తప్పులు, ఫొటోలు, పేర్లు సవరించడానికి దివ్యాంగులకు అవకాశం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాజా మోహిద్దీన్, మహేష్ కుమార్, ఓబులేసు, నారాయణస్వామి, గుర్రప్ప, అబ్దుల్ రషీద్, యదార్థుడు తదితరులు పాల్గొన్నారు.

# దాంపత్య కేసుల్లో రహస్య రికార్డులను కూడా సాక్ష్యంగా పరిగణించవచ్చు

**(విడాకులు మంజూరుకు అవి ప్రాతిపదికలే-సుప్రీం కోర్టు తీర్పు)**

**బద్వేలు లీగల్, ఆగష్టు 24 ప్రభాతవార్త :**

జీవిత భాగస్వామితో జరుపబడిన సంభాషణల రహస్య రికార్డులను వివాహ సంబంధ కేసులలో సాక్ష్యంగా పరిగణించవచ్చని సుప్రీం కోర్టు న్యాయమూర్తు బి.వి.నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. వివరాలలోకి వెళితే... పంజాబ్కు చెందిన ఓ భార్యా భర్తల వైవాహిక వివాద కేసును అనగా విడాకుల వ్యాజ్యమును ధర్మాసనం విచారించింది. మొదట 2017 సంవత్సరంలో భటిండాలోని ఫ్యామిలీ కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. తన భార్య తన పై విపరీతమైన వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించడమేగాక అందుకు సంబంధించిన ఆధారాలుగా ఆమెతో గతంలో చేసిన సంభాషణ రికార్డులతో కూడిన సి.డి. (కాంపాక్ట్ డిస్క్)లను కోర్టులో బాధిత భర్త సమర్పించగా సదరు సి.డి.ని సాక్ష్యంగా స్వీకరించడానికి ఫ్యామిలీ కోర్టు అంగీకరించింది. ఈ క్రమంలో కేసు పంజాబ్, హర్యాణ హైకోర్టుకు చేరింది. అయితే ఫోన్ సంభాషణల రికార్డు వ్యక్తిగత గోప్యతకు భంగకరం అని హైకోర్టు వాటిని తిరస్కరించడంతో బాధితుడు సుప్రీం కోర్టును ఆశ్రయించగా సదరు భార్యా భర్తల సంభాషణలకు ఎవిడెన్స్ యాక్టులోని 122వ సెక్షన్ క్రింద రక్షణ ఉంటుందని, వాటిని న్యాయ వివాదాలలో ఉపయోగించడాన్ని అనుమతించలేమని పంజాబ్, హర్యాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు ధర్మాసనం కొట్టివేసింది. సంభాషణల రికార్డులను సాక్ష్యాలుగా అనుమతిస్తే వైవాహిక బంధాన్ని కుటుంబంలో సామరస్యాన్ని దెబ్బతీస్తాయని భాగస్వామిపై గూఢచర్యానికి దారి తీస్తాయని హైకోర్టు వెలువరించిన అభిప్రాయంతో ధర్మాసనం గట్టిగా విభేదించింది. భార్యాభర్తలు పరస్పరం ఇలా సంభాషణను గుట్టుగా రికార్డు చేయడం వంటి పనులకు పాల్పడుతున్నారంటే ఆ బంధం మధ్య విశ్వాసం సన్నగిల్లినట్లు అర్థం అని పేర్కొంటూ సెక్షన్-122 ప్రకారం గోప్యత హక్కు భార్యాభర్తల సంభాషణలకు కూడా వర్తిస్తున్నది వాస్తవమే కానీ అది సంపూర్ణమైనది కాదని, ఈ అంశాన్ని ఆ సెక్షన్కు ఇచ్చిన మినహాయింపులతో తప్పనిసరిగా కలిపి చూడాల్సి వుంటుందని ధర్మాసనం నొక్కి వక్కాణించింది. భాగస్వాములకు తమ వాదనను రుజువు చేసే సాక్ష్యాలు సమర్పించే హక్కును గోప్యత వంటి అంశాల ప్రాతిపదికగా చూపించి కాలరాయలేమని ధర్మాసనం ఘాటుగా వెల్లడించింది. ఈ కేసులో భటిండా ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును ధర్మాసనం పునరుద్ధరిస్తూ దంపతుల కేసుల్లో రహస్య రికార్డులు సాక్ష్యంగా పరిగణిస్తూ అవి విడాకులకు ప్రాతిపదికలే అని తీర్పును వెలువరించింది. (అరైజింగ్ అవుట్ ఆఫ్ స్పెషల్ లీవ్ పిటీషన్ (సివిల్) నెం.21195/2021 జడ్జిమెంట్ ఆన్ 14-7-2025)

# పోలీస్ కానిస్టేబుల్ శిక్షణకు సన్నాహాలు



**కడప క్రైం, ఆగస్టు 24, ప్రభాతవార్త :**

ఇటీవల ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల(ఎస్.సి.టి.పి.సి)కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డి.టి.సి) ఆదివారం తెల్లవారుజామున జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రంలోని వసతి ఏర్పాట్లను, తరగతి గదులను, కార్యాలయ గదులను, మైదానం, అంతర్గత రహదారులను, బాటిల్ అబ్స్టాకల్ పరికరాలను పరిశీలించారు. డి.టి.సి డి.ఎస్.పి అబ్దుల్ కరీంకు పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ వెంట డి.టి.సి డి.ఎస్.పి అబ్దుల్ కరీం, సిబ్బంది ఉన్నారు.

# పారిశుద్ధ్య పనులు చేపట్టిన అధికారులు

**ఓబులవారిపల్లి ఆగస్టు 24 ప్రభాతవార్త**

**వార్త ప్రభావం**

పేరు గొప్ప ఊరు దిబ్బ అనే వార్త కథనానికి స్పందించి ఆదివారం ఎంపీడీవో మల్రెడ్డి తన కార్మిక శ్రామిక వర్గంతో పడకేసిన పారిశుధ్యం పై అపరిశుభ్రత లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టారు ఆదివారం పేరు గొప్ప ఊరు దిబ్బ అనే వార్త కథనానికి స్పందించారు మండలంలో ఎక్కడ అపరశుభ్రత లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా సర్వసన్నుతామన్నారు అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి ఎక్కడ అపరిశుభ్రత లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రజలకు అపరిశుభ్రత పై అవగాహన కల్పించి జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




దగ్గరుండి కార్మికులతో పని చేయిస్తున్న ఎంపీడీవో మల్రెడ్డి

# ఇండియన్ బిజినెస్ ఐకానిక్ అవార్డు

**రామసముద్రం ఆగస్టు 24 ప్రభాతవార్త**




రామసముద్రం మండలం ఊలపాడు గ్రామపంచాయతీ నరసాపురం గ్రామానికి చెందిన వినోద్ బెస్ట్ బిజినెస్ ఐ కానిక్ అవార్డు ఆదివారం అందుకున్నారు.ఆయన చరవాణిలో మాట్లాడుతూ మాది రామసముద్రం మండలం నరసాపురం గ్రామానికి చెందిన వాడినని మాది మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి అని మా అమ్మ, నాన్న వ్యవసాయంపై ఆధారపడి జీవించామన్నారు. నా విద్యాభ్యాసం రామసముద్రంలో 10 నుండి ఇంటర్ వరకు చదివానని డిగ్రీ తిరుపతి ఎంబిఏ బెంగళూరులో అభ్యసించానని ఆయన తెలిపారు. మండల అభివృద్ధికి ప్రణాళికలు రూపు దిద్దుతున్నన్నారు. అన్ని విషయాలు త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

# నిత్యం పూజలందుకొంటున్న అక్కదేవతలు

**నిమ్మనపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త :**



అక్కగార్ల కుంట వద్ద వెలసిన పంచముఖ ఆంజనేయుడు

మదనపల్లె-నిమ్మనపల్లె మార్గాన వెలసిన అక్కదేవతలు భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతలుగా నిత్యం పూజలు అందుకుంటున్నారు. మదనపల్లె- నిమ్మనపల్లె మార్గంలో అక్కగార్ల కుంట కలదు. అక్కడ అక్కదేవతలు వెలిశారు. ఈ అక్కదేవతలు పక్కనే అభయ ఆంజనేయస్వామి కొలువు తీరాడు. దీంతో మదనపల్లె పట్టణ వాసులతో పాటు నిమ్మనపల్లె మండల వాసులు కూడా భక్తులు తరలి వచ్చి పూజలుచేస్తుంటారు. ఈ ఆలయ ఆవరణంలో 15 అడుగుల ఎత్తైన నాగదేవల పుట్ట, పంచముఖ ఆంజనేయుడు, నవగ్రహాలు, నాగదేవతలు, సీతారామ,లక్షణుల విగ్రహాలు, కళకళలాడే కోనేరు అందులో తామరపువ్వులు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంటాయి. ఇంకా దేవ గన్నేరు చెట్టు, బలపత్రాకులచెట్లు, కలదు. తడి బట్టలతో ప్రతి సోమవారం, శుక్రవారం పూజలు చేస్తే అక్కదేవతలు కోరిన కోర్కెలు భక్తులకు అనుగ్రహిస్తారని మహిళలు వరపడుతుంటారు. పిల్లలు కలగని వారు ఇక్కడ అధికంగా ముడుపులు, వరపడడం వంటివి చేస్తారు. అతి పురాతనమైన ఆలయం కావడంతో ఇక్కడికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుండడం విశేషం. ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాలమైన మామిడి తోటలో అక్కగార్ల ఆలయం కలదు. ముఖ్యంగా సోమ, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు.